
'సోమశిల'లో 58.080 టీఎంసీల నిల్వ



అనంతసాగరం ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాంతాల నుంచి సోమశిల జలాశయానికి 22,868 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. డ్యాంలో 58.080 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,400, డెల్టాకు 1,850 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.



పూజా సామగ్రి కొనుగోలు చేస్తూ



గణపయ్య భలే ఉన్నాడు.. కదా!



కలిగిరి : మా విఘ్నేశ్వరుడికి దిష్టంతా పోవాలి!





ఎన్ని బొజ్జ గణపయ్య ప్రతిమలో...?

ఏ పని ప్రారంభించాలన్నా తొలిపూజ చేసేది విఘ్నేశ్వరుడికే!. గణాలకు అధిపతిగా, విఘ్నాలను తొలగించే స్వామిగా గణేశుడిని కొలుస్తారు. ఆ లంబోదరుడిని ఊరూరా పూజించే పండుగే వినాయక చవితి. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా భారీ సంఖ్యలో వినాయక ఉత్సవ మండపాలను ఏర్పాటు చేశారు. 8వేలకు పైగా విగ్రహాలను ప్రతిష్ఠించి సామూహిక పూజలకు ఉత్సవ కమిటీలు సిద్ధమయ్యాయి. చవితి ఉత్సవాలు సమైక్యతకు చిహ్నం. ఒక ప్రాంతంలోని వారంతా సమూహంగా ఏర్పడి సమన్వయంతో జరుపుకునే పండుగ. దేశ స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా ప్రజల్లో సమైక్యతను పెంపొందించేందుకు బాలగంగాధర్ తిలక్ బహిరంగంగా గణేశ్ ఉత్సవాలు చేసే సంస్కృతికి నాంది పలికారు.

మహా గణపతిం భజే!!

- నేడు వినాయక చవితి
- సమైక్యతను పెంచే పండుగ
- ఊరూరా సంబరాలు
- భారీగా మండపాలు.. 8వేలకుపైగా విగ్రహాలు
- ఉచిత విద్యుత్‌పై హర్షాతిరేకాలు



ఎక్కడి వాహనాలు అక్కడే

వినాయక చవితి అంటే ప్రకృతి పండుగ. పర్యావరణం విలువ, ప్రయోజనాలు తెలియజెప్పే పండుగ. వినాయకుని ప్రతిమను ప్రకృతిలోని మట్టి నుంచి చేస్తారు. గణపతికి అర్చించే 21 రకాల పూజా పత్రి ఔషధ గుణాల కలిగిన మొక్కల నుంచి సేకరిస్తారు. గజాననుడికి నైవేద్యంగా సమర్పించే పండ్లు, చెరకు గడలు అన్నీ ప్రకృతి ప్రసాదమే. పూజించిన పత్రిని నిమజ్జనం రోజు నీటిలో కలపడం ద్వారా వాటిలోని ఔషధ గుణాలు ఆ నీటిలో కలిసి పశుపక్ష్యాదులకు ఆరోగ్యాన్నిస్తాయి.

ఆడంబరాలతో అనర్థాలు

ఆధునిక సమాజంలో విపరీత పోకడలకు పోయి సహజసిద్ధంగా జరుపుకోవాల్సిన పండుగను హంగు, ఆర్భాటాలు, పోటీతత్వం, అవగాహన లోపంతో కాలుష్య కార కంగా మార్చేస్తున్నారు. రసాయనాలతో కూడిన, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన భారీ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇళ్లలో సైతం చాలా మంది పీవోపీ విగ్రహాలను పూజించి నిమజ్జనం చేస్తున్నారు. ఒక ఏడాది కాలంలో ఏర్ప డేంత కాలుష్యాన్ని వినాయక చవితి పండుగ పేరుతో ఒక్కరోజులోనే మనకు మనమే కొనితెచ్చుకొంటున్నాం. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వం, యంత్రాంగం చేతులెత్తేయడం తో చవితి పండుగ ప్రకృతి వినాశకంగా మారుతోంది. కొంతలోకొంత ప్రైవేటు, స్వచ్ఛంద సం స్థలు బాధ్యత తీసుకుని మట్టి గణపతి పూజ, ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పించడమేకాక మట్టితో చేసిన వినాయక ప్రతిమలను ఉచితంగానూ పంపిణీ చేస్తుండటం ఊరటనిచ్చే అంశం.

భారీ మండపాలు... ఎందరికో ఉపాధి

నెల్లూరు నగరంలో వినాయక చవితికి భారీ ఎత్తున మండపాలు నిర్మించారు. ఆలయాలు, రాజప్రాసాదాలను పోలిన సెట్టింగులను సిద్ధం చేశారు. వీటి నిర్మాణంతో వేలాది మందికి పని దొరి కింది. అలాగే ఉత్సవాలు ఐదు రోజులు నిర్వహించనున్న నేపథ్యంలో పూలు, పూలమాలలు, హైరర్స్ విద్యుత్ లైటింగ్, అర్చకులు, మిఠాయి దుకాణాలు, పండ్ల దుకాణాలు, ప్రసాదాల తయారీ, భోజన క్యాటరింగ్, ఆరెస్ట్రా కళాకారులకు ఉపాధి లభిస్తుంది. ఇదిలా ఉండగా ఈ ఏడాది గణేష్ మండపాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ వసతి కల్పించడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.


- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



నెల్లూరు: లస్సీ సెంటర్‌లో ఆకట్టుకున్న విద్యుద్దీప అలంకరణ

మట్టి గణపతులనే పూజిద్దాం

- ఏబీఎన్-ఆంధ్రజ్యోతి, సీఎంఆర్ చందనా బ్రదర్స్ ఆధ్వర్యంలో గణేశ్ ప్రతిమల పంపిణీ



మట్టి వినాయక ప్రతిమలను చూపుతున్న సీఎంఆర్ చందన బ్రదర్స్ డైరెక్టర్ సంతోష్ రామ్మోహన్, రాజీ యాడ్స్ పెంచలయ్య, తదితరులు



నెల్లూరు (సాంస్కృతికం) : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి, సీఎంఆర్ చందన బ్రదర్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ప్రజలకు మట్టి గణపతుల ప్రతిమలను అందజేశారు. ట్రంకురోడ్డులోని ఆ షాపింగ్ మాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సీఎంఆర్ చందన బ్రదర్స్ అధినేత మావూరి శ్రీనివాసరావు, డైరెక్టర్ సంతోష్ రామ్మోహన్, వెంకటగణేష్, ప్రతినిధి శైలేష్, రాజీ యాడ్స్ పెంచలయ్య, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి జి.రామకృష్ణ, ఏడీవీటీ మేనేజరు అబ్దుల్ రహీం, ఏబీఎన్ ఇన్‌చార్జ్ మహేష్, స్టాఫ్ రిపోర్టర్ యు.అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీ యాడ్స్ పెంచలయ్య మాట్లాడుతూ పర్యావరణం కాపాడుదాం-మట్టి గణపతులను పూజిద్దాం అనే నినాదంతో 20 సంవత్సరాలుగా మట్టి గణపతిలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. నగరంలో సీఎంఆర్ షాపింగ్ మాల్, చందనా బ్రదర్స్ కంచి కామాక్షి షోరూమ్‌లలో ఖాతాదారులకు, భక్తులకు మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు.

కందుకూరు గడ్డ..
పేకాటకు అడ్డా!

- రేయింబవళ్లు జోరుగా జూదం
- మాలకొండ, రామాయపట్నం పరిసరాల్లో శిబిరాలు
- పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి జూదగాళ్ల రాక
- చేతులు మారుతున్న రూ.కోట్ల నగదుత
- పేకాటరాయుళ్లకు పోలీసుల దీవెనలు?
- ప్రతిరోజూ రూ.2లక్షల వరకు మామూళ్లు
- ఉలవపాడు సమీపంలో శిబిరం...

ఆంధ్రజ్యోతి పరిశీలనలో వెలుగులోకి..

'మీకేం కాదండీ. రాజకీయ ముఖ్యనేతలతో నాకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అన్నీ నేను చూసుకుంటాను. మీరొచ్చి ఆడుకోండి. మా వాటా వాకిస్తే చాలు.'

- జూదరులకు కందుకూరు పరిసరాల్లోని ఓ వ్యక్తి ఇస్తున్న భరోసా ఇది.

కందుకూరు నియోజకవర్గం పేకాటకు అడ్డాగా మారిపోతోంది. పవిత్ర పుణ్యక్షేత్రం మాలకొండ పరిసరాలు, రామాయపట్నం పోర్టు పరిసరాల్లో కొన్ని నెలలుగా ఆర్గనైజ్డ్ పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు కోట్లాది రూపాయలు జూదంలో చేతులు మారుతోంది. శిబిరాలవైపు కన్నెత్తి చూడకుండా పోలీసులకు రమారమి రూ.2 లక్షలకుపైగా మామూళ్లు ముట్టజెబుతున్నట్టు సమాచారం. పోలీసులకు ఎవరైనా ఫిర్యాదుచేసినా వారి సమాచారం నిమిషాల్లో నిర్వాహకులకు వెళ్తుండటం వారు రంగంలోకి వచ్చి బెదిరింపులకు దిగుతున్నారంటే పరిస్థితి ఎంత దయనీయంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. కందుకూరు మున్సిపల్ పరిధిలోని ఓ వ్యక్తి అన్నీ తానై వ్యవహిస్తూ ఈ తతంగం నడుపుతున్నట్లు తెలుస్తోంది.

- వివరాలు 8లో..



రామాయపట్నం పరిసరాల్లోని ఓ అతిథిగృహంలో కోసు పేకాటలో పాల్గొన్న జూదగాళ్లు

బార్లకు దరఖాస్తు గడువు 29 వరకు పొడిగింపు

గీతకులాలతో కలిసి 30న లాటరీ ● ఐదు దరఖాస్తుల దాఖలు

నెల్లూరు(క్రైం): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన బార్ల పాలసీకి వ్యాపారుల ఆదరణ లభించకపోవడంతో దరఖాస్తు గడువును ఈ నెల 29వ తేదీ వరకు పెంచింది. జిల్లాలో 50 బార్ల ఏర్పాటుకు ఎక్సైజ్ అధికారులు దరఖాస్తులు ఆహ్వానించారు. గీత కులాల వారికోసం ఐదు బార్లు కేటాయించారు. మంగళవారం వరకు గడువు విధించారు. అయితే సోమవారం వరకు ఒక్క దరఖాస్తు రాలేదు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఐదు దరఖాస్తులు దాఖల య్యారు. కందుకూరులోని ఒక బారుకు నాలుగు దరఖాస్తులు, మరో బారుకు ఒక దరఖాస్తు మాత్రమే వ్యాపారస్తులు వేశారు. నూతన పాలసీ ప్రకారం ఒక్కో బారుకు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తారు. ఈ నేపథ్యంలో దరఖాస్తు గడువు పెంచడంతో గీతకులాల వారికి కేటాయించిన బార్లతోపాటే అన్నీ బార్లకు ఈ నెల 30వ తేదీన లాటరీ తీయనున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

టీడీపీ జిల్లా పగ్గాలు
ఎవరికో!?

- బరిలో నలుగురు ముఖ్యనేతలు
- త్రీమెన్ కమిటీకి దరఖాస్తుల అందజేత
- అనుబంధ కమిటీలకూ పలువురు దరఖాస్తు
- మంత్రులు, ఎమ్మెల్యేలతోనూ కమిటీ సమావేశం
- అధిష్ఠానానికి నివేదిక ఇవ్వనున్న త్రీమెన్ కమిటీ
- నాయకులతో విస్తృతస్థాయి సమావేశం



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రులు సత్యప్రసాద్, ఆనం, నారాయణ, ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు

నెల్లూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పదవిపై ఉత్కంఠ నెలకొంది. నలుగురు ముఖ్య నేతలు ఈ పదవికి పోటీ పడటంతో ఎవరికి దక్కేనో అన్న ఆసక్తి మొదలైంది. ప్రస్తుత అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, జడ్పీ మాజీ ఛైర్మన్ చెంచలబాబు యాదవ్‌లు ఆశావాహుల జాబితాలో ఉన్నారు. అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఎంపికతోపాటు అనుబంధ సంఘాల ఎంపికకు సంబంధించి టీడీపీ అధిష్ఠానం నియమించిన త్రీమెన్ కమిటీ మంగళవారం నెల్లూరులో విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి త్రీమెన్ కమిటీ సభ్యులైన మంత్రి అనగాని సత్యప్రసాద్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, డూండి రాకేష్‌లతోపాటు జిల్లాకు చెందిన మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీద మస్తాన్ రావు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కాకర్ల సురేష్, దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డిలు హాజరయ్యారు. ముందుగా టీడీపీ జెండాను ఆవిష్కరించిన నేతలు పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. తదుపరి జిల్లా నేతలు, కార్యకర్తలతో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో మంత్రులు ప్రసంగించారు. వైసీపీ ప్రభుత్వంలో చేసిన పోరాటాలు, కార్యకర్తల కృషిని గుర్తు చేశారు. కమిటీల ఎంపికకు సంబంధించి పార్టీ విధివిధానాలను వారు వివరించారు. అనంతరం జిల్లా కమిటీ, అనుబంధ కమిటీల నియామకానికి సంబంధించి ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సుమారు 50 మందికిపైగా వివిధ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటన్నింటినీ త్రీమెన్ కమిటీ స్వీకరించింది.

ముఖ్యనేతల నుంచి అభిప్రాయాల సేకరణ

జిల్లా అధ్యక్ష పదవి కోసం అజీజ్, వెంకటేశ్వర్లురెడ్డి, పట్టాభిరామిరెడ్డి, చెంచలబాబు యాదవ్‌లు ఆసక్తి కనబరిచినట్లు తెలిసింది. వీరు తమ ఆసక్తిని త్రీమెన్ కమిటీకు తెలియజేశారు. అనంతరం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలతో త్రీమెన్ కమిటీ వన్ టు వన్ సమావేశమైంది. అధ్యక్ష పదవితోపాటు ఇతర పదవులపై వారి అభిప్రాయాన్ని తెలుసుకుంది. ముఖ్య నేతలంతా తమ అభిప్రాయాన్ని కాగితం మీద తెలియజేసి కమిటీకి అందజేశారు. ఈ అభిప్రాయాలన్నింటినీ త్రీమెన్ కమిటీ సభ్యులు రహస్యంగా ఉంచారు. వీటన్నింటినీ క్రోడీకరించి ముగ్గురు నేతలతో కూడిన ప్రతిపాదనలను టీడీపీ అధిష్ఠానానికి అందజేయనున్నారు. అలానే వచ్చిన దరఖాస్తుల ఆధారంగా అనుబంధ సంఘాల ఎంపికకు సంబంధించి కూడా ఒక నివేదికను త్రీమెన్ కమిటీ అధిష్ఠానానికి అందజేయనుంది. ఎక్కువ మంది ఇద్దరు నేతల వైపే మొగ్గు చూపినట్లు సమాచారం. ఆ ఇద్దరి నేతల్లోనే ఎవరో ఒకరికి అధ్యక్ష పదవి దక్కే అవకాశాలున్నట్లు టీడీపీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. విస్తృతస్థాయి సమావేశం నేపథ్యంలో టీడీపీ జిల్లా కార్యాలయం నాయకులు, కార్యకర్తలతో కిక్కిరిసిపోయింది.

డీఎస్సీ అభ్యర్థులకు
రేపటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

నెల్లూరు(విద్య), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ-2025కు సంబంధించి మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారం నుంచి జరగనుంది. అన్ని సబ్జెక్ట్‌ల మెరిట్ జాబితాలను ఇప్పటికే డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచిన నేపథ్యంలో వివిధ కేటగిరి పోస్టులకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలనకు ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈవో ఆర్ బాలాజీరావు తెలిపారు. అభ్యర్థులు తమ వ్యక్తిగత మెగా డీఎస్సీ లాగిన్ ద్వారా కాల్ లెటర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. అందులో సూచించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఇటీవల జారీ చేసిన కులధ్రువీకరణ పత్రం, అంగవైకల్యం ఉంటే ఆ ధ్రువీకరణ పత్రం, కాల్‌లెటర్‌లో సూచించిన ఇతర పత్రాలు, గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన మూడు సెట్ల జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలను తీసుకుని వారికి సూచించిన సమయానికి హాజరు కావాలన్నారు. హాజరు కాని, అర్హత లేని వారి స్థానంలో జాబితాలో తర్వాత ఉన్న వారికి అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ముందే ఆయా సర్టిఫికెట్లను వెబ్ సైట్‌లో వ్యక్తిగత లాగిన్ ద్వారా అప్‌లోడ్ చేయాలని సూచించారు. అభ్యర్థులందరూ నిబంధనలు పాటిస్తూ నెల్లూరులోని వీఆర్ ఐపీఎస్ ప్రాంగణంలో జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు సమయానికి హాజరు కావాలని కోరారు.

ఎరువుల దుకాణాలు ఆకస్మిక తనిఖీ

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం వ్యవసాయశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్లు, స్టాక్ బోర్డు, బిల్లుల పుస్తకాలు, నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎరువుల నిర్వహణ విషయంలో ఎలాంటి అతిక్రమణలకు పాల్పడినా లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరకే ఎరువులు అమ్మాలని, ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నెల్లూరు భూసార పరీక్ష కేంద్రం ఏడీఏ కన్నయ్య, వెంకటాచలం, నెల్లూరు వ్యవసాయశాఖ అధికారులు హరి, కరుణాకర్‌రెడ్డి, ఎస్‌వీ నాగమోహన్ పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9636
వెండి కిలో ధర	రూ. 119800
వెండి ఒక గ్రాము	రూ. 122.80

మంత్రిని కలిసిన గౌడ సంఘం నేతలు

వెంకటాచలం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరుకి విచ్చేసిన రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను మంగళవారం జిల్లా గౌడ సంఘం నేతలు మర్యాదపూర్వకంగా వెళ్లి కలిశారు. ఈసందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం జిల్లాలోని పలు గౌడ సమస్యల ను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు గౌడ సంఘం జిల్లా కార్యదర్శి కోసూరు వెంకటసుబ్బయ్య గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో అనికేపల్లి మాజీ ఎంపీటీసీ కోసూరు పద్మగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతినెలా సంఘబంధాల సమావేశాలు నిర్వహించాలి

మనుబోలు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వీవోఏలు, సీసీలు తప్పనిసరిగా ప్రతినెలా సంఘబంధాల సమావేశాలు నిర్వహించాలని ఏపీఎం వనజాక్షి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం నెలవారీ ఈసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘబంధాల వారీగా రికార్డులు, ఎంతమేర పొదుపులు, రుణాలు, రికవరీలపై సమీక్ష చేశారు. ప్రతి సంఘబంధం అధ్యక్ష, కార్యదర్శులు వారి పరిధిలో ఉన్న సంఘాల చేత పొదుపు, రికవరీలను సక్రమంగా చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర అధ్యక్షురాలు పరిమళ నిర్మలమ్మ, కార్యదర్శి నారాయణమ్మ, సీసీలు రాజేశ్వరి, ప్రసన్న, వెంకటేశ్వర్లు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

వింజమూరు : ప్రతీ దివ్యాంగ విద్యార్థి విద్యావంతుడు కావాలని, వారికున్న శారీరక, ఆరోగ్య సమస్యలు విద్యకు దూరం చేయకూడదని, అందుకు అనుగుణంగా కేంద్రం మార్గదర్శకాలు రూపొందించిందని కేంద్ర సామాజిక న్యాయ సాధికారిత మంత్రిత్వశాఖ జాతీయ నిధి సభ్యుడు వీ. శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 9, 10 తరగతుల విద్యార్థులు 31లోపు, ఆపై చదువుతున్న విద్యార్థులు అక్టోబరు 31లోపు స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

మెగా డీఎస్సీలో బుచ్చి యువతి ప్రతిభ


కంభంపాటి లక్ష్మి


బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన కంభంపాటి లక్ష్మి డీఎస్సీ ఫలితాల్లో ప్రతిభ చాటి 2 ఉద్యోగాలకు అర్హత సాధించింది. ప్రస్తుతం ఈమె కొడవలూరు మండ లం గండవరం సచివాలయంలో మహిళా పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డీఎస్సీ లో 76.69 మార్కులతో జిల్లాలో 17వ ర్యాంకు సాధించి తెలుగు స్కూలు అసిస్టెంట్‌గా, టీజీటీ తెలుగులో 75.33 మార్కులతో 3 జిల్లాల జోనల్ స్థాయిలో 21వ ర్యాంకుతో రెండో ఉద్యోగానికి అర్హత సాధించింది. ఈమె సచివాలయ ఉద్యోగి కాగా ప్రవృత్తితో సింగర్‌గా రాణిస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. ఈమెకు సహోద్యోగులు, స్నేహితులు, బంధువుల అభినందనలు తెలిపారు.

క్యాన్సర్‌కు అరుదైన శస్త్రచికిత్స

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో క్యాన్సర్ వ్యాధిగ్రస్తునికి అరుదైన శస్త్రచికిత్సను విజయవం తంగా నిర్వహించారు. మంగళవారం ఆసుపత్రిలో డాక్టర్ రంగరామన్ మీడియాకు వివరాలు వెల్లడించారు. తిరుపతికి చెందిన రమణయ్య (57) క్యాన్సర్‌తో బాధపడుతుండగా ఆయనకు మూలకణాల మార్పిడి శస్త్రచికిత్స చేశామని చెప్పారు. ఖరీదైన ఈ చికిత్సను ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద నిర్వహించామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సెంటర్ హెడ్ రంజిత్‌రెడ్డి, క్యాన్సర్ విభాగం హెడ్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుడి పూజలకు సర్వం సిద్ధం

కోవూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సర్వ విఘ్నాల్ని హరించే సిద్ధి వినాయకుడ్ని బుధవారం కొలిచేందుకు మండల పరిధిలోని గ్రామాల్లో భక్తులు సిద్ధమయ్యారు. వినాయక చవితిని ఆనందోత్సాహాల నడుమ నిర్వహించుకునేందుకు మంగళవారం అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. స్థానిక బజారు కూడలిలో పెద్దసంఖ్యలో మహిళలు పత్రిని కొనుగోలు చేశారు. మట్టి వినాయకుని ప్రతిమలు, రంగురంగుల్లో తీర్చిదిద్దిన బొజ్జ గణపతి విగ్రహాలను ఇళ్లకు తీసుకువెళ్లారు. కోవూరు పట్టణంలో వీధులన్నింటిలో భారీ వినాయక ప్రతిమలను యువకులు ఏర్పాటు చేస్తున్నారు.


వినాయకుడి పూజాసామగ్రి కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న బుచ్చిలోని చెన్నూరురోడ్డు


కోవూరు: మట్టి వినాయక ప్రతిమ కొనుగోలు చేస్తున్న బాలిక

వినాయక చవితి సందడి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరిం చుకుని బుచ్చి నగర పంచాయతీతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో గణేష్ విగ్రహాలు నెలకొల్పేందుకు యువకులు బుచ్చి, నెల్లూరు తదితర ప్రాంతాల నుంచి గణేష్ విగ్రహాలు తరలించుకుపోతున్నారు. గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో బుచ్చి పట్టణంలో పలు వీధుల్లో గణేష్ విగ్రహాలు నెలకొల్పుతుండగా, ఒక్కో గ్రామ పంచాయతీలో 3 నుంచి 10 గణేష్ విగ్రహాలు నెలకొల్పేందుకు యువకులు మండపాలు సిద్ధం చేసుకున్నారు. బుచ్చి నగర పంచాయతీ, మండలంలోని గ్రామీణ ప్రాంతాలు, పరిసర మండలాల నుంచి వినాయక చవితికి పూజా సామగ్రి, వంటింటి సరుకులు, కొత్త బట్టలు తదితర కొనుగోలు చేసేందుకు వచ్చిన జనాలు, వ్యాపారస్థులతో బుచ్చి పట్టణంలోని చెన్నూరు రోడ్డు కిటకిటలాడింది.

60 గణేశ్ మండపాలకు దరఖాస్తులు


మనుబోలులోని గణేశ్ మండపం నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ. శివరామకృష్ణారెడ్డి, ఎస్ఐ శివరాకేష్

మనుబోలు: మండలవ్యాప్తంగా 60 గణేశ్ మండపాలకు అనుమతులు కోరుతూ ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తులు అందాయని పొదలకూరు సీఐ. శివరామకృష్ణారెడ్డి తెలిపారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాలను మంగళవారం పోలీసులు వేర్వేరుగా సందర్శించి, నిర్వాహకుల నుంచి వివరాలు సేకరించారు. మనుబోలు బీసీ కాలనీ వినాయక ఆలయం వద్ద ఏర్పాటైన మండపాన్ని సీఐ పరిశీలించారు. గతంలో లాగా కాకుండా అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు, అనర్థాలు జరిగినా నిర్వాహకులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. పోలీసుల నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఏ మాత్రం ప్రవర్తించరాదన్నారు. అనంతరం నిర్వాహకుల వివరాలు, వారి ఆధార్‌కార్డుల నంబర్లు, సెల్‌ఫోన్ నంబర్లు నమోదు చేసుకున్నారు.

బాలుడి ప్రాణం తీసిన పొరపాటు

● బాణసంచా పేలుళ్ల ఘటనకు ఏడాది ● నిర్వాహకులూ తస్మాత్ జాగ్రత్త
● పోలీసులు, విద్యుత్ అధికారులు బీ అలెర్ట్

మనుబోలు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వస్తుందంటే అందరి కంటే ముందుగా ఎగిరి గంతులేసేది చిన్నపిల్లలే.. రోజుల తరబడి సంబరాలు చేసుకునే పండుగ కావడంతో చిన్నాపెద్దా గణేష్ చతుర్థశకు ముందుకు వస్తారు. మరో మాటేమిటంటే వీధికో వినాయక మండపం పెట్టి ఉత్సవాలు చేస్తారు. ఇదంతా బాగానే ఉంది. గతేడాది మనుబోలులో చవితి వేడుకల్లో జరిగిన అపశ్రుతి తలుచుకుంటే ఇప్పటికీ భయమేస్తుంది. మండపాల నిర్వాహకులు అన్నీ విషయాల్లో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇటు పోలీసులు, విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యం చేయకుండా అలర్ట్‌గా ఉండి, ప్రజలను, అప్రమత్తం చేయాలి.


టపాసుల పేలుడులో చనిపోయిన బాలుడు (ఫైల్)

● **జాగ్రత్తలు తీసుకోవాలి...**

గతేడాది మనుబోలు బీసీ కాలనీలో 9రోజుల పాటు గణనాథుడికి పూజలు చేశారు. గతేడాది సెప్టెంబరు 15న గ్రామోత్సవం నిర్వహించాల్సి ఉండగా, ముసుగు తీసే క్రమంలో నిర్వాహకులు టపాసులు పేల్చారు. టపాసులు ఒక దగ్గర పెట్టి కాల్చుతుండగా ఓ చువ్వ కరెంటు వైరుకు తగిలి రివర్స్‌లో కిందపడి పేలింది. ఈక్రమంలో అక్కడే ఉన్న మిగతా టపాసులు ఒక్కసారిగా పేలిపోయాయి. ఈ విస్ఫోటనంలో చిన్నారి కందలి ఉమామహేష్ (12) మృతిచెందాడు. దీంతో పాటు 30మందికి తీవ్ర గాయాలయ్యాయి. టపాసులు చుట్టుపక్కల ఇళ్లలోకి దూసుకెళ్లి పేలడంతో ఆరిళ్ల వరకు దెబ్బతిన్నాయి. కరెంటు వస్తువులు పాడైపోయాయి. ఈ ఏడాది కూడా యువత పోటీలుపడి మండపాలకు భారీ వినాయక విగ్రహాలను తీసుకువచ్చారు. కేవలం టపాసులు విషయంలోనే కాక సెంట్రింగ్ దగ్గరి నుంచి విద్యుత్ దీపాలు అమర్చే వరకు, చివరికి గణేష్ నిమజ్జనం చేసే ప్రతి అంశంలోనూ నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి.

అందరినీ హెచ్చరిస్తున్నాం

గణేశ్ మండపాల నిర్వాహకులందరినీ హెచ్చ రిస్తున్నాం. గతేడాది బీసీ కాలనీ పేలుళ్ల ఘటనలో బాలుడు చనిపోవడం బాధాకరం. ఎక్కెడక్కెడ మండపాలు పెడుతు న్నారు, ఏ సమయంలో ఏయే తేదీల్లో ఉత్స వాలు చేస్తున్నారన్నది నమోదు చేసుకుంటాం. సిబ్బందిని ఉంచి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటాం. ఎలాంటి అనర్థాలు జరిగినా నిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

- ఎస్ఐ. శివరాకేష్

ముందస్తు చవితి వేడుకలు



ముందస్తు వినాయక చవితి పూజల్లో ఉపాధ్యాయులు

పొదలకూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నాగార్జున ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో మంగళవారం సాయంత్రం ముందస్తు వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. మట్టితో తయా రు చేసిన వినాయకుడి ప్రతిమను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. విఘ్నేశ్వరుడికి ఉండ్రాళ్లను నైవేద్యంగా పెట్టారు. అనంతరం విద్యార్థులకు ప్రసాదాలు పంచిపెట్టారు. భక్తిగీతాల కోలాటం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చీఫ్ అడ్వైజర్ అన్నం సుబ్బారావు, అకడమిక్ డీన్ కృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, ఏవో జీవీఆర్ వైస్ ప్రిన్సిపాల్ పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

గజాననుడి సూక్ష్మచిత్రాలు


వెలగపండు, రావి ఆకులపై గణేష్ చిత్రాలు

మనుబోలు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఈ ఫొటోలో కనిపిస్తున్న విద్యార్థిపేరు ఇందూరుపల్లి కార్తీక్. మండలంలోని వీరంపల్లి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఆ పాఠశాల తెలుగు పండిట్ సోమా పద్మారత్నం సూచనతో వెలగపండు, రావి ఆకుపై గజాననుడి చిత్రాలు గీసి, రంగులు అద్ది వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. వీటిని మంగళవారం పాఠశాలలో ప్రదర్శించడంతో ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు కార్తీక్‌కు అభినందనలు తెలిపారు.

'స్త్రీశక్తి'తో ఆనందంగా మహిళల బస్సు ప్రయాణం


వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ప్రజా రవాణా అధికారిణి షమీమ్

రాపూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో సంతోషంగా ఉచిత ప్రయాణం చేస్తున్నారని జిల్లా ప్రజా రవాణా అధికారిణి షేక్.షమీమ్ తెలిపారు. మంగళవారం తనిఖీల్లో భాగంగా రాపూరు డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 15 నుంచి సోమవారం వరకు 11,41,000 మంది మహిళలు, రాపూరు డిపోలో 1,05,000 మంది మహిళలు ప్రయాణించారని తెలిపారు. జిల్లాలో గతంలో 45శాతం మహిళలు ప్రయాణించేవారని, ప్రస్తుతం 59శాతం మంది ప్రయాణిస్తున్నారని తెలిపారు. ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచిత ప్రయాణం చేసేందుకు అవకాశమిచ్చిందున, మహిళలు ఒరిజినల్ ఆధార్‌కార్డు చూపించాలన్నారు. జిల్లాలో సిబ్బంది కొరత ఉందని, రాపూరు డిపోలో కూడా 20 మందిని త్వరలో భర్తీ చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాపూరు డిపో డీఎం అనీల్‌కుమార్, యూనియన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వినాయక ప్రతిమ ఏర్పాటుపై అభ్యంతరం

● ఇంటెలిజెన్స్ ఐజీ సూచనలతో పోలీసుల రంగ ప్రవేశం

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామచంద్రాపురం ఎస్సీ, ఎస్టీ కాలనీలో వినాయక ప్రతిమ ఏర్పాటును ఓ సామాజిక వర్గం అభ్యంతర వ్యక్తం చేసింది. దీంతో ఇంటెలిజెన్స్ అధికారులకు ఫిర్యాదు అందడంతో పోలీస్ అధికారులు రంగంప్రవేశం చేశారు. స్థానికులు బుచ్చిలోని హిందూ చైతన్య వేదిక, సమరతసేవా ఫౌండేషన్, బీజేపీ నాయకుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు రామచంద్రాపురంలో విచారించారు. వినాయక ప్రతిమ ఏర్పాటుపై రెండు సామాజిక వర్గాల మధ్య వివాదం రేగినట్టు ఇంటెలిజెన్స్ అధికారులకు ఫిర్యాదు అందడంతో ఐజీ సూచనల మేరకు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసులు, సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ సంతోష్‌రెడ్డి తమ సిబ్బందితో రామచంద్రాపురానికి చేరుకున్నారు. పలువురు నాయకులు పోలీసులతో మాట్లాడి పక్కవీధిలో ప్రతిమ ఏర్పాటు చేకోవాలని సూచించడంతో అంతా ప్రశాంతమైంది.

ఎమ్మెల్యే తనయుడు అర్జున్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాల్మానుపురంలో మంగళవారం రాత్రి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తనయుడు అర్జున్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను స్థానిక దళితవాడలో ఘనంగా నిర్వహించారు. దళితులు కేక్ కట్‌చేసి అర్జున్‌రెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. 30 ఏళ్లుగా స్థలాలు, ఇళ్లు లేక కాలువ పక్కన గుడిసెలతో ఎదుర్కొంటున్న ఇబ్బందులు చూసిన అర్జున్‌రెడ్డి ఎమ్మెల్యే ద్వారా తమ సమస్య పరిష్కారం చేయిస్తున్నారని, ఆయన జన్మదిన వేడుకలు జరుపుకోవడం తమకు ఎంతో తృప్తినిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు నాగేంద్ర, పెంచలయ్య, శ్రీహరి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వనంతోపు ప్రాంతానికి చెందిన నూకలపాటి రాఘవరెడ్డి మంగళవారం మృతిచెందడంతో ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సింహపురి దేహ సమర్పణ సంస్థ కన్వీనర్లు విజయమ్మ, భారతి సమాచారంతో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ సునీల్ ఈ నేత్రాలను సేకరించారు.

ముదిరాజ్‌ల కులవృత్తిని మత్స్య వృత్తిగా గుర్తించాలి

● ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రఘురాం


మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందచేస్తున్న రఘురాం , అనిల్ కుమార్ తదితరులు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ముదిరా జ్ కులస్థుల కులవృత్తిని మత్స్య వృత్తిగా రికార్డుల్లో నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కనకట్ల రఘురాం ముదిరాజ్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌కు మంగళవారం నగరంలో వినతిపత్రం అందచేశారు. రాష్ట్రంలో 18లక్షల మందికిపైబడి ముదిరాజ్ కులస్థులు ఉన్నారని, వారిలో 60శాతం మందికిపైగా మత్స్యకార వృత్తిలో జీవనం సాగిస్తున్నారని చెప్పారు. వారు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకోవడానికి రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకుంటే కులవృత్తి లేదని తిరస్కరిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో కులవృత్తిని మత్స్యకార వృత్తిగా నమోదు చేసి, ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహా సభ జిల్లా అధ్యక్షుడు గుంపల అనిల్‌కుమార్ ముదిరాజ్, జీవీ కృష్ణయ్య, డీ రమణయ్య, బీ రాఘవేంద్ర, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటీపీ సమస్యను పరిష్కరించాలి : డాక్యుమెంటు రైటర్లు

రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్‌ను జిల్లా దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘ నాయకులు కలిశారు. దస్తావేజుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఓటీపీ సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన మంత్రి స్టాంపులు-రిజి స్ట్రేషన్ శాఖ ఐజీకి ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ సాఫ్ట్‌వేర్‌లో మర్పులు చేయాలని ఆదేశించారు. ఇతర సమస్యలేమైనా ఉంటే తెలియచేస్తే పరిష్కరిస్తామని డాక్యుమెంటు రైటర్లకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైటర్ల సంఘం అధ్యక్షుడు పట్నం దుర్గేష్ బాబు, రాయసం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రేశిత గేటెడ్ కమ్యూనిటీలో సోలార్ పవర్


శ్రేశిత గేటెడ్ కమ్యూనిటీ

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో ఉన్న బాబానగర్‌లో నిర్మితమైన శ్రేశిత టెక్నాలజీ ఇండియా గేటెడ్ కమ్యూనిటీలో నివసించే వారికి జీవిత కాలం కరెంటు బిల్లులు లేకుండా సోలార్ పవర్ సదుపాయం కల్పించామని ఆ సంస్థ చైర్మన్ ఎస్ నర్మదరెడ్డి తెలిపారు. మారుతున్నకాలానికి అనుగుణంగా తమ ప్రాజెక్టును డిజైన్ చేశామని పేర్కొన్నారు. 60 శాతం ఓపెన్ స్పేస్ వదిలామన్నారు. ధృడమైన గోడలు, పిల్లలు ఆడుకొనేందుకు ప్లేజోన్ వంటివి ఏర్పాటు చేశామని తెలిపారు. తూర్పు, పడమర ఫేసింగ్ కలిగిన డబుల్ బెడ్‌రూం ప్లాట్లు బ్యాంకు లోన్ సౌకర్యంతో అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.

వినాయక వ్రతకల్పం పుస్తకాల పంపిణీ

నెల్లూరు(విద్య), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వివేకానందవాకర్స్ ఆధ్వర్యంలో మంగళవారం వాకర్స్‌కు వినాయక వ్రత కల్పం పుస్తకాలను పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, సభ్యులు పాల్గొన్నారు.

● నగరంలోని బాలాజీనగర్ ఎడిఫై స్కూల్‌లో మంగళవారం వినాయక చవితి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు వినాయకుని కథను వివరించి, వారితో బంకమన్ను, పిండితో స్వామివారి విగ్రహా లను తయారు చేయించారు. కరస్పాం డెంట్ నరేష్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

రైల్లో నుంచి పడి జార్ఖండ్ వాసి మృతి


సోమ్రా నాగేసియా మృతదేహం

కావలి రూరల్, ఆగస్టు 26(ఆంధ్ర జ్యోతి): కావలి పట్టణం మద్దూరు పాడు సమీపంలో దిగువమార్గంలోని రైలు పట్టాలపై సోమ్రా నాగేసియా (30) మృతదేహాన్ని మంగళవారం ఉదయం కీమెన్ గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ కే.వెంకట్రావ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి పట్టాలపై మృతదేహం పడి ఉన్న తీరును బట్టి గుర్తు తెలియని రైల్లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెంది ఉండ వచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. మృతుడి వద్ద లభించిన ఆధారాల ప్రకారం జార్ఖండ్ వాసిగా గుర్తించి మృతుడి బంధు వులకు సమాచారమిచారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి భద్రపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి ..

కావలిరూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ పరిధిలోని ముసునూరు టోల్‌గేట్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కావలి రూరల్ పోలీసుల కథనం మేరకు.. బోగోలు మండలం పాత బిట్రగుంటకు చెందిన కందుకూరి రాగేశ్వరరావు(68) పూల వ్యాపారంతో పాటు ఆలయాల్లో పూల డెకరేషన్ చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో కావలి పట్టణంలోని ఓ ఆలయంలో పూల డెకరేషన్ చేసేందుకు సోమవారం రాత్రి ఒప్పందం కుదుర్చుకున్నాడు. అక్కడి నుంచి మోటారు బైక్‌పై తమ గ్రామానికి వెళ్తుండగా టోల్‌గేట్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన రాగేశ్వరరావును చికిత్స నిమిత్తం 108 వాహనంలో పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించగా అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతుడి భార్య పరమేశ్వరి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా రూరల్ ఎస్ఐ తిరుమలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శివలింగం చోరీ కేసులో నిందితుల అరెస్టు

అల్లూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : శివలింగం చోరీ కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా న్యాయాధికారి రిమాండ్ విధించినట్టు ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని నార్తుఆములూరు-గొల్లపాలెం సమీపంలోని శివాలయంలో ఈ నెల 15వ తేదీన శివలింగం చోరీకి గురైంది. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టగా కోవూరు, పడుగుపాడు ప్రాంతాలకు చెందిన ఉమ్మడిశెట్టి హరికృష్ణ, షేక్ వాజిద్ అహ్మద్, పాండిచ్చేరి కుమార్, యాటగిరి శ్రీనివాసులు, అనంతపురం జిల్లా ముదిగుబ్బకు చెందిన శ్రీనివాసులులు ముఠాగా ఏర్పడి ఆరోజు అర్ధరాత్రి 11 గంటల సమయంలో మినీ వ్యాన్‌లో వచ్చి శివాయలం ఎదురుగా నిలిపారు. ఎవరూ లేని విషయాన్ని గమనించి లోపలికి వెళ్లి గడ్డపారలతో శివలింగం చుట్టూ తవ్వి శివలింగాన్ని తమ వాహనంలో తీసుకెళ్లారు. కోవూరు గ్రామ శివారులోని నిర్మానుష్య ప్రాంతంలో ఆ శివలింగంను పగలగొట్టి అందులోని ఉన్న రాగి నాణేలను అపహరించుకెళ్లారు. ఈ ఘటనపై నమోదైన కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లైంగిక దాడి కేసులో ఐదేళ్ల జైలు, జరిమానా

నెల్లూరు (లీగల్), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న కేసులో నేరం రుజువు కావడంతో పాదర్తి విద్యా సాగర్ అలియాస్ కామయ్య అనే నిందితుడికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష తోపాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ మంగళవారం తీర్పు చెప్పారు, ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కావలి మండలం ముసునూరు గ్రామానికి చెందిన నిందితుడు కామయ్య అదే గ్రామానికి చెందిన ఓ బాలికపై 2017 డిసెంబరు 13న లైంగిక దాడికి యత్నించాడు. ఈ మేరకు కావలి రూరల్ పోలీసులు నిందితుడిపై పోక్సో యాక్ట్ కింది కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ చంద్రశేఖర్ వాదించారు.


డైమండ్ డబ్బా నిర్వహిస్తున్న నిర్వాహకులు

కాయ్ రాజా.. కాయ్ !

● గొలగమూడిలో విచ్చలవిడిగా జూదం
● స్పందించని పోలీసులు,అధికారులు

వెంకటాచలం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన గొలగమూడి అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారింది. వెంకయ్యస్వామి 43వ ఆరాధనోత్సవాల్లో భాగంగా రెండురోజుల క్రితం కంటేపల్లి మార్గంలోని క్రికెట్ మైదానంలో ఏర్పాటు చేసిన జాయింట్ వీల్స్ (ఉయ్యాల) వద్ద డైమాండ్ డబ్బాను యధేచ్ఛగా నిర్వహించారు. ఈ జూదం ఆడేందుకు యువత పోటీ పడ్డారు. అయితే కొందరు స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా వారు సత్వరమే స్పందించలేదు.దీంతో నిర్వాహకులు ఇదే అదునుగా మరీ రెచ్చిపోయారు. యువత నుంచి రూ.లక్షలు దోచుకున్నారు. డబ్బులు పోగొట్టుకున్న యువత మాత్రం లబోదిబోమన్నారు. ఒకానొక దశలో డబ్బులు పోగొట్టుకున్న యువకులకు డైమాండ్ డబ్బా నిర్వాహకులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. గొలగమూడిలో ఇలా డైమాండ్ డబ్బా ఎలా నిర్వహిస్తారని, ఇలాంటి జూదాలు ఇక్కడ ఇలా నిర్వహించడం మంచికాదని కొందరు యువకులు వెళ్లి ప్రశ్నించారు. అయితే తాము అధికారులకు మామూళ్లు ఇచ్చే ఆటను నిర్వహిస్తున్నామని, ఎక్కడైనా, ఎవరికైనా ఫిర్యాదు చేసుకోవచ్చని నిర్వాహకులు సమాధానం ఇచ్చినట్లు సమాచారం. పోలీసులకు స్థానికులు సమాచారమిచ్చినా అప్పటికప్పుడు స్పందించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. డైమాండ్ డబ్బా నిర్వహిస్తున్న వీడియోలను కొందరు యువకులు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి డైమాండ్ డబ్బా వంటి జూదాలను నడిపించిన వారిపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.ల్లో)
బాయిలర్ లైవ్	108
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220

కోడిగుడ్ల ధర (100): 540



కాలువల్లో ఇంత పూడికుందా!?

కాలువల్లో ఏంటి ఇంత పూడికుంది...? ఇలా ఉంటే మురుగునీళ్లు బయటకు ఎలా వెళ్తాయి...? అంటూ పారిశుధ్య అధికారులు, సిబ్బందిపై ఎంహెచ్‌వో కనకాద్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్య పనుల పరిశీలనలో భాగంగా ఆయన మంగళవారం వైకుంఠపురంలో పర్యటించారు. అక్కడ కాలువలో భారీగా పూడికతీయడం గమనించారు. ఇంత పూడిక వచ్చిందంటే కాలువలు శుభ్రం చేసి ఎన్ని రోజులు అవుతోందని మండిపడ్డారు. ఇదే పరిస్థితి కొనసాగితే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)

మట్టి గణపతులనే పూజించండి

● కాలుష్య నియంత్రణ మండలి అధికారి అశోక్

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజలందరూ బుధవారం వినాయక చవితి పండుగను మట్టి గణపతులతోనే జరుపుకోవాలని కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి ఎన్ అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. పీవోపీ విగ్రహాలు వాతావరణాన్ని కలుషితం చేస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఆర్డీవో అనూష, అధికారులు పాల్గొన్నారు. కాగా, మట్టి గణపతి ప్రతిమలనే పూజించి పర్యావరణాన్ని కాపాడాలని మూలస్థానేశ్వరస్వామి ఆలయం ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి భక్తులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సాయంత్రం ఆలయం వద్ద ఆయన మట్టి గణపతులను పంపిణీ చేశారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.



మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఆర్డీవో అనూష

గణేశ్ బొమ్మల కొలువు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని భక్తవత్సలనగర్‌కు చెందిన కార్పెంటర్ ఎం శ్రీనివాసులు మంగళవారం వినాయకుల బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. వినాయక చవితి సందర్భంగా ఆయన మామిడి కొయ్యతో చేసిన బొమ్మలను ప్రదర్శించారు.

నేటి నుంచి విద్యా గణపతి ఉత్సవాలు

నగరంలోని ఆదిత్య నగర్ చిల్డ్రన్స్ పార్కు వద్ద ఉన్న విద్యా గణపతి దేవస్థానంలో బుధవారం నుంచి 29వతేదీ వరకు గణేష్ ఉత్సవాలు జరుగుతాయని ఆలయ వ్యవస్థాపకుడు పాజెర్ల శంకరయ్య, మణెమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు ఈ వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు : గణేశ్ ఉత్సవ సమితి

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి ఉత్సవాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామన్నందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం స్థానిక శివాజీ సెంటర్‌లోని కార్యాలయం లో గోకరాజు గంగరాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. సమితి అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ వినాయక చవితి రోజు ఇంట్లో గణపతిని పూజించి అదే రోజు నిమజ్జనం చేయదలచిన వారి కోసం నెల్లూరు చెరువు ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం గణేష్ ఘాట్ వద్ద అన్నీ ఏర్పాట్లు చేశామని చెప్పారు. 31వ తేదీ మధ్యాహ్నం 3గంటల నుంచి నిమజ్జన శోభాయాత్ర జరుగుతుందని, దానికి కూడా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శులు మండల ఈశ్వరయ్య, టీ భాస్కర్‌రెడ్డి, వీ హర్షవర్ధన్, ఫణిరాజ్, నాగిరెడ్డి, శ్రీకంఠ రమణయ్య, శ్రీనివాసులురెడ్డి, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు : ఎస్పీ

నెల్లూరు(క్రైం), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలకు జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ జీ కృష్ణకాంత్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బంది, పాత్రికేయులకు ఆయన వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. పర్యావరణాన్ని పరిరక్షించుకునేలా మట్టి గణపతి ప్రతిమలనే పూజించాలని పిలుపునిచ్చారు. నిబంధనలకు లోబడి పండుగ చేసుకోవాలని ప్రజలకు సూచించారు. గణేష్ ఘాట్‌లో విగ్రహ నిమజ్జన సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు ఉత్సవ కమిటీల నిర్వాహకులు, శాంతి కమిటీలు సహకరించాలని కోరారు.

వీపీఆర్ ఇంటికి త్రిసభ్య కమిటీ

● తాజా రాజకీయాలపై చర్చ



వీపీఆర్ ఇంట్లో మంత్రులు, నాయకులు

నెల్లూరు రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జిల్లా అధ్యక్ష ఎంపిక నేపథ్యంలో నగరానికి చేరుకున్న పార్టీ త్రిసభ్య కమిటీ సభ్యులు మంగళవారం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విందుకు హాజరయ్యారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, పురపాలక శాఖ మంత్రి నారాయణ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆర్య, వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్యేలు సురేష్, నాగేశ్వరరావు, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో వీపీఆర్ దంపతులు భేటీ అయ్యారు. తాజా రాజకీయాలు, అధ్యక్ష పదవి ఎంపిక, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల నిర్వహణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ కార్పొరేషన్ ఛైర్మన్ దినేష్‌రెడ్డి, ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ కార్పొరేషన్ ఛైర్మన్ శివప్రసాద్, నాయకులు గిరిధర్‌రెడ్డి, రూప్ కుమార్, పట్టాభిరామిరెడ్డి, వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులతో అక్రమాలకు చెక్

● మున్సిపల్ మంత్రి నారాయణ

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ రేషన్ కార్డులతో రేషన్ అక్రమాలకు చెక్ పడుతుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. నగరంలోని పొర్లుకట్లలో మంగళవారం ఆయన లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థను పారదర్శకంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఎస్వో విజయకుమార్, పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, ఆర్డీవో అనూష, నాయకులు పాల్గొన్నారు. కాగా, కిలో మీద తమకిస్తున్న కమీషన్‌ను రూ2కు పెంచాలని నెల్లూరు జిల్లా చౌకధరల దుకాణాదారుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు పోబోలు వెంకట సుబ్బయ్య మంత్రి నారాయణకు వినతిపత్రం ఇచ్చారు.



వృద్ధురాలికి స్మార్ట్ రైస్ కార్డ్ అందజేస్తున్న మంత్రి

ఏజీపీకి సన్మానం

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా నియమితులైన షేక్ అన్వర్‌బాషాను పీహెచ్‌పీ, రూడ్స్ సంస్థలు మంగళవారం సన్మానించాయి. పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, మహబూబ్ బాషా, రూడ్స్ ట్రస్ట్ ఛైర్మన్ షేక్ రసూల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, నరసాపురం ప్రసాద్, నంద్యాల మాలిని పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి కల్యాణం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బాలాజీనగర్ పద్మావతి నగర్‌లో శ్రీసాయి యూత్ నిత్య అన్నదాన మందిరం 4వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఆదిలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత పెంచలనరసింహస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. వేదగిరి ఫణిశర్మ బృందం శాస్త్రోక్తంగా ఈ వేడుక నిర్వహించారు. సాయిదర్బార్ ఛైర్మన్ మధుసాయి, గౌరవ సలహాదారుడు రామసుబ్బయ్య, తదితరులు పర్యవేక్షించారు.

రాజరాజేశ్వరి ఆలయంలో కాత్యాయనీ వ్రతం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం రాత్రి కాత్యాయనీ వ్రతం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం అభిషేకాలు, విశేష పూజలు, చండీ హోమం జరిగాయి. సుందరేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

గొలుసు దొంగల హల్‌చల్

నెల్లూరు(క్రైం), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం గొలుసు దొంగలు హల్‌చల్ చేశారు. పడారుపల్లి కావేరి నగర్‌లో బుజ్జమ్మ అనే మహిళ మంగళవారం ఉదయం ఇంటి ముందు ముగ్గువేస్తుండగా ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని రెండున్నర సవర్ల బంగారు సరుడును తెంపుకుని పరారయ్యారు. బాధితురాలు వేదాయ పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే హరనాథపురం మూడవవీధిలో సుమతి అనే మహిళ నడుచుకుంటూ వెళుతుండగా దుండగులు ఆమె మెడలోని 18 గ్రాముల బంగారు గొలుసును తెంపుకెళ్లారు. బాధితరాలు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈవీఎం గోదాముల వద్ద భద్రత ఉండాలి : డీఆర్వో

నెల్లూరు(వెంకటేశ్వరపురం), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోదాముల వద్ద నిరంతరం పటిష్ట భద్రతను ఏర్పాటు చేయాలని డీఆర్వో హుస్సేన్ సాహెబ్ ఆదేశించారు. మంగళవారం ఉదయం ఈవీఎం గోదాములను నెల్లూరు ఆర్డీవో అనూషతో కలసి ఆయన తనిఖీ చేశారు. నిరంతరం నిఘా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో నిర్మలానంద బాబా, అర్బన్ తహసీల్దారు షఫీమాలిక్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఓటరు జాబితాకు సహకరించండి

నెల్లూరు(సిటీ), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు సిటీ నియోజకవర్గానికి సంబంధించి 2025 ఎలక్టోరల్ జాబితా సవరణపై పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో నగర కమిషనర్ నందన్ మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీల నుంచి సమగ్రమైన వివరాలు అందించాలని, సలహాలు, సూచనలు ఇస్తే మెరుగైన ఓటరు జాబితా తయారీకి కృషి చేస్తామని చెప్పారు. ఒక కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే దగ్గర, ఒకే పోలింగ్ బూతు పరిధిలోకి వచ్చేలా చూడాలని కోరారు.

శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానము

మూలాపేట, నెల్లూరు. శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా.

సీల్డ్ టెండరు ప్రకటన నెం.26/2025 తేది:26-08-2025

శ్రీ దేవిశరన్నవరాత్రి మహోత్సవములు -2025

పై దేవస్థానమునకు తేది.22-09-2025 నుండి 02-10-2025 వరకు జరుగు శరన్నవరాత్రి మహోత్సవము సందర్భంగా సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు షెడ్యూలు తేది.27-08-2025 ఉదయం 10.00 గంటల నుండి 09-09-2025 సాయంత్రం 7.00 గంటల వరకు షెడ్యూల్ 1కి రూ.500/-లు చెల్లించి కొనుగోలు చేయవచ్చును. తేది.10-09-2025 బుధవారం ఉదయం 10.30 గంటల లోపు పూర్తి చేసిన షెడ్యూల్‌ను టెండర్ బాక్సు నందు వేయవలెను. ఉదయం 11.00 గంటలకు సీల్డ్ టెండర్లు తెరవబడును. ఇతర వివరములకు ఆలయ కార్యాలయము నందు పనివేళలలో సంప్రదించగలరు.

వ. నెం.	టెండరు వివరములు	ధరావత్తు
1.	పందిళ్ళు వేయుట మరియు షెల్టర్స్ సప్లయి చేయుట	10,000/-
2.	విద్యుత్ దీపాలంకరణ చేయుటకు	10,000/-
3.	పవర్ జెనరేషన్ మరియు అవసరమైన పుష్పం సరఫరా చేయుటకు	10,000/-
4.	ప్రతి రోజు పగలు, రాత్రి 11 రోజులకు సెక్యూరిటీ గార్డ్‌లను ఏర్పాటు చేయుట	10,000/-
5.	వీడియో కవరేజ్ ఏర్పాటు, ఫోటోలు తీయుట	10,000/-
6.	11 రోజులకు పనివారలకు, డిప్యూటేషన్ సిబ్బందికి, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉ. అల్పాహారం, మ.భోజనం, రాత్రికి అల్పాహారం షెడ్యూల్‌లో చూపిన విధముగా ఏర్పాటు చేయుట	10,000/-
7.	దసరా 11 రోజులు శానిటేషన్ సిబ్బందిని షెడ్యూల్‌లో చూపిన విధముగా ఏర్పాటు చేసి పనులు నిర్వహించుట	10,000/-

కార్యనిర్వహణాధికారి

చవితి పందిళ్లు.. రంగురంగుల భారీ గణనాథుల ప్రతిమలు.. అన్నప్రసాద వితరణలు.. మహిళా భక్తుల కోలాహలం.. యువత సందడితో వినాయక చవితి వేడుకలు మళ్లీ వచ్చాయి. గతం కంటే భిన్నంగా సమైక్యత చాటుతూ వాడవాడలా ఉత్సవ కమిటీ సారథ్యంలో వేడుకలకు సిద్ధమయ్యాయి. పదిమందిని ఒక్కచోటుకు చేర్చి సమైక్య భావాలను పెంపొందింపచేస్తున్నాయి.

- ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి)

రారండోయ్.. వేడుక చేద్దాం!

- సమైక్యతను పెంచుతున్న గణనాథులు
- వీధివీధికి పెరుగుతున్న ఉత్సవ కమిటీలు
- నూతన పరిచయాలకు వేదికగా వేడుకలు
- నేటి నుంచి వినాయక చవితి ఉత్సవాలు

జిల్లాలో వినాయక చవితి వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా మొదలుకానున్నాయి. భిన్నసంస్కృతులు.. సంప్రదాయాలు కలగలిసిన సమాజంలో అందరినీ ఒకతాటిపైకి తీసుకొస్తున్నాయి చవితి వేడుకలు. ఒకప్పుడు మహనగరాలకే పరిమితమైన ఈ వేడుకలు ఇప్పుడు ఊరూరా వ్యాపించాయి. వీధివీధిన చవితి పందిళ్లు ఏర్పాటు చేసి సమైక్యతను చాటుకుంటున్నారు.

● భిన్నమతాల ఐక్యతకు తోడ్పాటు

చవితి వేడుకలకు చందాలు వసూలు చేయడం పరిపాటిగా మారింది. ఈ వేడుకల్లో అందరినీ భాగస్వామ్యం చేయడమే దీని పరమార్థం. ఈ క్రమంలో స్థానికంగా నివసిస్తున్న భిన్నమతాల వారు కూడా ఈ వేడుకలు విజయవంతం అయ్యేందుకు చందాలు ఇచ్చి సహకరించడంతోపాటు అనేక ఇతర కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. ఇది ఆయా ప్రాంతాల్లో సుహృద్భావ వాతావరణానికి ఎంతగానో దోహదం చేస్తుంది.



● పరిచయాలకు వేదికగా...

పట్టణ ప్రాంతాల్లో 70 శాతం మందికిపైగా వేర్వేరు ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారే ఉంటారు ఇటువంటి వారికి ఒకరినొకరు పరిచయం కావడానికి చవితి వేడుకలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ముఖ్యంగా అపార్టుమెంట్లు సంస్కృతి క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో సమైక్యతకు ఈ వేదికలు ఉపయోగపడుతున్నాయి. చవితి ఏర్పాట్లతో సమావేశాలు ప్రారంభమైన ఈ పరిచయాలు వేడుకలు ముగిసేనాటికి కుటుంబ సభ్యులుగా మారుతున్నారు.

● గ్రామాల్లో వేడుకలు

గ్రామాల్లో ఒకప్పుడు ఉత్సవాలంటే దసరా, శ్రీరామనవమి, గ్రామదేవతకు జరిపే తిరునాళ్లే. ఆయా సమయాల్లో ఇతర ప్రాంతాల్లో ఉన్నవారంతా సొంతూళ్లకు చేరిపోతారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు గ్రామాల్లో కూడా వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించడం సంప్రదాయంగా మారింది. ఒకప్పుడు తిరునాళ్లకు గ్రామాలు వెళ్లేవారు ఇప్పుడు చవితి వేడుకలకూ వెళుతున్నారు.

● పోలీసులు డేగకన్ను

వినాయక ఉత్సవాలు అంటే భారీ హంగామా ఉంటుంది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఈ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులు చర్యలు ప్రారంభించారు. ఈ ఉత్సవాలపై నిఘా పెట్టారు. వివాదాస్పద ప్రాంతాలపై దృష్టి కేంద్రీకరించారు. శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు.



25వేల రుద్రాక్షలతో వినాయక ప్రతిమ

నెల్లూరు (సాంస్కృతికం) : నగరంలోని సీఎంఆర్ షాపింగ్‌మాల్‌లో 25 వేల రుద్రాక్షలతో మహాగణపతిని ఏర్పాటు చేశారు. ప్రతి వినాయక చవితికి వెరైటీ పర్యావరణ గణపతులను ఏర్పాటు చేస్తున్న సీఎంఆర్ అధినేతలు ఈసారి ఐదుగురు కళాకారులు 10 రోజులు శ్రమించి ఈ ప్రతిమను తీర్చిదిద్దారు. అలాగే, కాలుష్య రహిత గణపతి ప్రతిమల తయారీపై విద్యార్థులు, చిన్నారులకు పోటీలు జరగ్గా, విజేతలకు బహుమతులు అందజేశారు.



వరికుంటపాడులో ఆరుబయటే ఉన్న స్టీలు

ఆరుబయట స్టీలు భద్రమేనా!?

● గుట్టురట్టవుతుందని హౌసింగ్ అధికారుల ఆందోళన

ఉదయగిరి రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం కాలనీలు కాదు... గ్రామాలను నిర్మిస్తామని గొప్పలు చెప్పి, నిధుల దుర్వినియోగానికి పాల్పడింది. అప్పట్లో జిల్లా వ్యాప్తంగా 98,781 ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టగా, అందులో సుమారు 29,246 ఇళ్ల నిర్మాణ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించింది. అదే అదునుగా కాంట్రాక్టర్లు కొంత మంది అధికారులతో కుమ్మక్కై అవినీతికి తెరలేపారు. భారీ మొత్తంలోనే ఇళ్లకు కేటాయించాల్సిన సిమెంటు, స్టీలును పక్కదారి పట్టించి జేబులు నింపుకున్నారు.

కాగా ఇటీవల ఉదయగిరి మండల హౌసింగ్ ఏఈ రామకృష్ణ తన అనుచరుల ద్వారా దుత్తలూరు మండల గోదాము నుంచి స్టీలును అక్రమంగా తరలించేందుకు పూనుకున్నారు. ఈ బాగోతంపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేయడంతో హౌసింగ్, విజిలెన్స్ ఉన్నతాధికారులు విచారణ చేపడుతున్నారు. ఈ క్రమంలో గతంలో ఇతర మండలాల్లోను అవినీతికి పాల్పడిన మరికొంతమంది అధికారులు, సిబ్బంది గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. తమ గుట్టు ఎక్కడ రట్టవుతుందోనని లోలోన మదనపడుతున్నారు. ఇదంతా ఒకవంతైతే మిగిలిన మండలాల్లోను నిల్వ ఉన్న స్టీలు భద్రమేనా, లెక్కకు సరిపోతాయా? అన్న అనుమానాలు సైతం వ్యక్తమవు తున్నాయి. వరికుంటపాడులోనూ అప్పటి అధికారులు అవసరం లేకపోయినా కమీషన్లకు కక్కుర్తి పడి ఏకంగా 36 టన్నుల స్టీలు కొనుగోలు చేశారు. దీంతో ఆరుబయటే ఉన్న ఆ స్టీలును చూసిన ప్రజలు కనీసం ఇదైనా భద్రంగా ఉంటుందా ? అని చర్చించుకుంటున్నారు.అన్నీ మండలాల్లోనూ సమగ్రంగా దర్యాప్తు జరిపితే మరింత అవినీతి దందా వెలుగు చూసే అవకాశం ఉంది.

కందుకూరు గడ్డ.. పేకాటకు అడ్డా!

- రేయింబవళ్లు జోరుగా జూదం
- మాలకొండ, రామాయపట్నం పరిసరాల్లో శిబిరాలు
- చేతులు మారుతున్న రూ.కోట్ల నగదు
- పేకాటరాయుళ్లకు పోలీసుల దీవెనలు?

కందుకూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గం పేకాటకు అడ్డాగా మారిపోతోంది. గత కొన్ని నెలలుగా పగటివేళల్లో మాలకొండ పరిసరాల్లోని అటవీప్రాంతంలోను, రాత్రి పది దాటాక తెల్లవారే వరకు రామాయపట్నం పరిసర ప్రాంతాలలో పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారు. కందుకూరు పరిసరాల్లోని పేకాట రాయుళ్లతోపాటు నెల్లూరు, ఒంగోలు, కావలి, పామూరు తదితర పట్టణాలు, చెన్నై ప్రాంతాల నుంచి కూడా ఇక్కడకు కార్లలో తరలివస్తున్నారు. ఒకేసారి 30, 40 మంది ఆటలో పాల్గొనేలా కోసు (కోతముక్క) పద్ధతిలో జరిగే ఆటలో నిమిషాల్లోనే లక్షలాది రూపాయలు చేతులు మారతాయి. ప్రతిరోజు కనీసం కోటి రూపాయలకు తక్కువ కాకుండా చేతులు మారుతుండగా నిర్వాహకులు అందులో పదిశాతం వరకు లబ్ధి పొందుతూ రూ.2 లక్షల వరకూ మామూళ్లరూపంలో ముట్టజెబుతుండటం విశేషం. తెట్టు నుంచి రామాయపట్నం వెళ్లేమార్గంలో ఇందుకోసమే నిర్మించిన ఓ ప్రత్యేక అతిథిగృహంలో బాహాటంగా ఈ పేకాట జరుగుతోంది. ఈ అతిథి గృహంలోనే కాకుండా ఆయా పరిసరాల్లోని బహిరంగ ప్రదేశాలకు, మరికొన్ని సందర్భాలలో ఉలవపాడు పరిసర ప్రాంతాలకు ఈ శిబిరాలను మారుస్తుంటారు. ఇటీవల ఈ పేకాటలో రూ.3 కోట్లకుపైగా పోగొట్టుకున్న ఒంగోలుకు చెందిన ఓ వ్యక్తి తన స్వీయగాథను వినిపిస్తూ సోషల్ మీడియాలో పెట్టడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నెలరోజుల క్రితం గుడ్లూరు మండలం పరకొండపాడు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు రాత్రంతా పేకాటలో పాల్గొని కారులో తిరిగివస్తూ మద్యం మత్తులో ఓ చెట్టును ఢీకొనగా ఒకరు మృతి చెందారు. ఈ కేసును కూడా పోలీసులు పేకాట ప్రస్తావన రాకుండా తారుమారు చేయడం విశేషం.



ఉలవపాడు సమీపంలోని ఓ పెట్రోలు బంకు వద్ద పేకాటరాయుళ్ల కార్లు ఇవి

● ఆంధ్రజ్యోతి పరిశీలనలో...

రాత్రిపూట జరుగుతున్న పేకాట శిబిరాల గుర్తింపు కోసం సోమవారం అర్ధరాత్రి ఆంధ్రజ్యోతి ప్రత్యేక పరిశీలన చేయగా ఉలవపాడు సమీపంలోనే పేకాట శిబిరం నడుస్తూ కనిపించింది. జాతీయ రహదారి పక్కనే ఓ పెట్రోలుబంకు సమీపంలో పదికిపైగా కార్లు ఒకేచోట ఆపి ఉండగా అనుమానంతో ఆ పరిసరాల్లో గాలించగా పేకాట శిబిరానికి సెంట్రీ డ్యూటీ చేస్తున్న వ్యక్తులు కనిపించారు. దీంతో తక్షణం ఉలవపాడు ఎస్‌ఐ అంకమ్మకు సమాచారం ఇవ్వగా ఆయన ఓ కారులో వచ్చి కొద్దిసేపు జాతీయ రహదారిపై గాలించి అనంతరం పేకాట శిబిరం సమీపానికి చేరుకోగా సెంట్రీ డ్యూటీ చేస్తున్న వారు మాత్రమే ఆయనకు పట్టుబడగా అసలైన పేకాట రాయుళ్లు తప్పించుకుని వెళ్లిపోయారు. అయితే పెట్రోలుబంకు సమీపంలో ఉన్న కార్లను స్వాధీనం చేసుకున్న దాఖలాలు లేవు. కాగా నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి, రూ.2200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు ప్రకటించటం విశేషం. ఈ విషయమై ఉలవపాడు ఎస్‌ఐ అంకమ్మను ప్రశ్నించగా సోమవారం రాత్రి ఉలవపాడు సమీపంలో పేకాటశిబిరం నడిచిన మాట వాస్తవమని అన్నారు. అయితే అర్ధరాత్రి తనకు సమాచారం వచ్చే సమయానికి తాను, డ్రైవర్ మాత్రమే ఉన్నామని హడావిడిగా ఇద్దరం ఘటనా స్థలానికి వెళ్లినా ఇద్దరం అంతమందిని పట్టుకోలేమని ఓ కీలక మార్గంలో కాపుకాసినట్లు తెలిపారు. తొలుత పట్టుబడ్డ ముగ్గుర్ని స్టేషన్‌కి తీసుకెళ్లి మళ్లీ వచ్చేసరికి మరో వ్యక్తి బైక్‌లో ఆయిల్ అయిపోయి దొరికాడని వివరించారు. ఈలోగా మరో ఇద్దరు సిబ్బందిని పిలిపించుకుని గాలించామని, పెట్రోలుబంకు వద్ద ఉన్న కార్లకు పంక్చర్లు పెట్టి ఉదయాన్నే హైకోర్టు డ్యూటీ ఉండటంతో వెళ్లినట్లు వివరించారు. కార్ల ఆధారంగా పేకాటరాయుళ్లను విచారిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

● జిల్లా ఎస్పీకి ఫిర్యాదు

కందుకూరు ప్రాంతంలో జోరుగా పేకాట జరుగుతున్నవైనం, స్థానిక పోలీసు అధికారులంతా మామూళ్లమత్తులో తూలుతుండటంపై ఎస్పీకి కూడా పెద్దఎత్తున ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం. ఆ తర్వాత నుంచి పోలీసుల సూచనల మేరకు పేకాటరాయుళ్ల స్థావరాలను మార్చి ఈ వ్యవహారాన్ని కొనసాగిస్తుండటం గమనార్హం. ఈ పేకాటల నిర్వహణలో క్రియాశీలంగా ఉన్న వ్యక్తి రాజకీయ ప్రముఖుల పేర్లను ఉటంకిస్తుండటం కేవలం పోలీసు శాఖకు కలంకమే గాక ప్రభుత్వ ప్రతిష్ఠను కూడా దిగజార్చేలా ఉన్నందున ఈ శిబిరాలపై ఉక్కుపాదం మోపాలని ఈ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు.

లింగ నిర్ధారణ చేస్తే చర్యలు తప్పవు

● స్కానింగ్ కేంద్రాలకు డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత హెచ్చరిక

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ కేంద్రాలపై చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత హెచ్చరించారు. మంగళవారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం జిల్లాస్థాయి సలహా సంఘం సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు స్కానింగ్‌కు సిఫార్సు చేయరాదని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా స్థాయి సలహా సంఘం చైర్‌పర్సన్ డాక్టర్ కిరణ్ మాట్లాడుతూ లింగ నిష్పత్తి బాలురు 1000 మంది ఉండగా బాలికలు 1011 మంది ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్ స్వర్ణలతారెడ్డి, డాక్టర్ కరీముల్లా, డీఐవో డాక్టర్ ఉమా మహేశ్వరి, శివశంకర్‌రావు, డెమో కనకరత్నం, ఎన్జీవో కవితరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

29న 'రాయభారం'

బుచ్చిరెడ్డిపాళెం: ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు, రైతులు పండించిన ధాన్యం గిట్టుబాటు ధర కోసం ఈనెల 29న నెల్లూరులోని కలెక్టరేట్ వద్ద నిర్వహించే రాయ భారం కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా రైతాంగం పార్టీలకతీతంగా తరలిరావాలని ఏపీ కౌలు రౌతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల గుర్నాథం పిలుపునిచ్చారు. మంగళవారం బుచ్చిలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూ.20,136 మద్దతు ధర ప్రకటిస్తే మిల్లర్లు మాత్రం రైతుల నుంచి 15000 నుంచి 16 వేల లోపే ధాన్యం కొనుగోలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సురేష్, లక్ష్మయ్య, మౌలయ్య పాల్గొన్నారు.

కావలిలో చిచ్చు పెడితే ఊరుకోం!

● మాజీ మంత్రి కాకాణిపై ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఫైర్

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంతంగా ఉన్న కావలి నియోజక వర్గంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చిచ్చు పెడితే చూస్తూ ఊరుకునేది లేదని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నెల్లూరులోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 83 రోజులు జైలులో ఉన్న కాకాణి కావలికి వచ్చి ప్రజలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. గత పదేళ్లపాటు ఎమ్మెల్యేగా ఉన్న ప్రతాప్ కుమార్‌రెడ్డి ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. కావలిని గంజాయికి కేంద్రంగా మార్చి, తన అనుచరుల ద్వారా వీటి అమ్మకాలు సాగించారని ఆరోపించారు. కావలిలో రూ.70 కోట్ల మనీస్కామ్ జరిగిందని, ఇందులో రామిరెడ్డికి సంబంధం ఉందన్నారు. ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు తీసుకుని బ్లూ మెటల్ క్వారీని నడుపుతున్నట్లు చెప్పారు. 2023లో టీడీపీ అభ్యర్థి అవుతానని తెలిసిన రోజునే ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో క్వారీపై దాడులు జరిగాయన్నారు. చట్ట విరుద్ధంగా రూ.143 కోట్లు పెనాల్టీ విధించారని చెప్పారు. హైకోర్టు తలుపులు తట్టగానే ప్రభుత్వం తల దించుకుని క్వారీకి క్లీన్ చిట్ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రతాప్‌రెడ్డి కల్యాణమండటం, ఇల్లు, ఇంజనీరింగ్ కళాశాల ఆక్రమణతో నడుస్తు న్నాయని విమర్శించారు. డ్రోన్ సహాయంతో బెంగళూరు నుంచి రౌడీలను తీసుకు వచ్చి తన ఆచూకీ కనిపెట్టాలని రామి రెడ్డి పర్యవేక్షించారన్నారు. ఈ సమా వేశంలో టీడీపీ నేతలు పమిడి రవి కుమార్ చౌదరి, బీద గిరిధర్, అలే ఖ్య, హనుమంతరావు, బండి శ్రీని వాసులరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి

మత్స్యకారుడి మృతి

ఇందుకూరుపేట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మైపాడు పడమటిపాలెంకు చెందిన ఊటుకూరు ఆదిశేషయ్య(45) మరో నలుగురు మత్స్యకారులతో కలిసి మంగళ వారం సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. వేట సమయంలో ఆదిశేషయ్యకు గుండెపోటు రావడంతో తోటి మత్స్యకారులు ఒడ్డుకు చేర్చి దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. డాక్టర్ వైద్య పరీక్షలు నిర్వహించి మృతి చెందినట్లు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీతో పాటు మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే గణేశ్ విగ్రహాల నిర్వహణ సింగిల్ విండో సిస్టం నిబంధనలకు లోబడి ఉండాలని, అతిక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని విగ్రహాల నిర్వహణ కమిటీలను సీఐ శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో హెచ్చరించారు. ప్రతిచోట ఎన్‌ఓసీలు, క్యూఆర్‌కోడ్‌ల ప్రకారం నిబంధనలు పాటించాలని తెలిపారు. డీజేలు, అశ్లీల డ్యాన్సులు, మద్యం సేవించి బైకరేస్‌లు చేయడం, అల్లర్లు లాంటి సమస్యలు తలెత్తితే నిర్వాహకులు బాధ్యతని పేర్కొన్నారు.

పరిపాలన విభాగాన్ని వేధిస్తున్న సిబ్బంది కొరత!

- 8 మందికి ఒక్కరే విధుల్లో..
- పనులు సాగేదెలా?
- ఇది కావలి ఏరియా వైద్యశాలలో పరిస్థితి
- పట్టించుకోని పాలకులు, ఉన్నతాధికారులు

కావలి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా వైద్యశాల పరిపాలనా విభాగాన్ని సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇక్కడ మొ త్తం 8మంది సిబ్బందికి గాను ఒకే ఒక్కరు విధులు నిర్వహిస్తున్నారు. దీంతో వైద్యశాలలో పరిపాలనా విభాగంకు చెందిన అత్యవసర పనులన్నీ నిలచిపోతు న్నాయి. వాస్తవానికి పరిపాలనా విభాగంలో ఒక అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, ఒక సూపరింటెండెంట్, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటరీ ఆపరేటర్లు, ఒక జూనియర్ అకౌంటెంట్, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు ఉండాలి. కేవలం ఒక ఆఫీస్ సూరింటెండెంట్ మాత్రమే ఉన్నారు. అలాగే ఎక్స్‌రే విభాగంలో ముగ్గురు డార్క్ రూము సహాయకులు ఉం డాల్సి ఉండగా ఒక్కరు కూడాలేరు. దీంతో సిబ్బంది కొరతతో పరిపాలనా విభాగంలో అన్ని పనులు స్తంభించి పోతున్నాయి. శాలరీ బిల్లులు, హెడ్‌ఆఫీస్ నుంచి వచ్చిన మెయిల్స్‌కు సకాలంలో సమాచారం ఇవ్వడం తదితర సేవలకు ఇబ్బందికరంగా ఉం టుంది, ఏదైనా మీటింగ్‌కు వెళ్లితే ఆరోజు కార్యక్రమాలన్నీ పూర్తిగా ఆగిపోతున్నాయి. హెచ్‌డీఎస్, షాపింగ్ రూములు, నేష నల్ హెల్త్ మిషన్ బడ్జెట్‌లు తదితరాల లావాదేవీలన్నీ నిలిచిపోతు న్నాయి. అలాగే బాలింతలకు జనరిక్ సురక్షిత స్కీం, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్నవారికి ఇచ్చే పారితోషకం తదితరాల లావాదేవీలన్నీ పరిపాలన విభాగం నుంచి జరగాల్సి ఉంది. అయితే 8 మందికిగాను ఒకే ఒక్కరు విధులలో ఉండడంతో పరిపాలనా విభాగం సేవలు పూర్తిగా స్తంభించి పోతుండటంతో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది.

● ఎక్స్‌రే ప్లాంట్‌లో ఒకే ఒక్కరు..

ఎక్స్‌రే రూములో ఒక ఉద్యోగితో పాటు ముగ్గురు డార్క్‌రూము సహాయకులు ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా లేనందున ఎక్స్‌రేలు తీయడానికి ఇబ్బందికరంగా ఉంది. ఉన్న ఒకే ఒక ఎక్స్‌రే తీసే వ్యక్తి 24 గంటలు అందుబాటులో ఉండటం సాధ్యం కానందున ప్రమాదాలకు గురై ఆసుపత్రికి వచ్చిన వారికి ఎక్స్‌రేలు తీయాలంటే అర్ధరాత్రి సమయంలో ప్రైవేట్ ఎక్స్‌రేల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. జాతీయ రహదారి పక్కన ఏరియా వైద్యశాల ఉండటంతో ప్రమాదాలకు గురైన వ్యక్తులకు సహాయకులు కూడా లేకుండా వస్తున్నందున అలాంటి సమయంలో బయటకు పంపి ఎక్స్‌రేలు తీసేందుకు కూడా అవకాశం లేక వ్యాధి నిర్ధారణలు తెలియక వైద్యసేవలు అందించటం కూడా ఇబ్బందికరంగా మారుతోంది. ఉన్నతాధికారులు స్పందించి ఏరియా వైద్యశాలలో సిబ్బంది కొరత లేకుండా తగు చర్యలు తీసుకుని సేవలకు ఆటంకాలు కలగకుండా చూడాల్సి ఉంది.



కావలి ఏరియా వైద్యశాల భవనం

వేగంగా సోమేశ్వరాలయ పునర్‌నిర్మాణ పనులు

అనంతసాగరం ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భారీవరదలకు సోమశిల వద్ద ఉన్న సోమేశ్వరుడి ఆలయం ధ్వంసమైన విషయం తెలిసిందే. అయితే గతంలో వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ క్రమంలో ప్రస్తుత ప్రభుత్వం ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపింది. దేవదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆలయానికి పూర్వవైభవం తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఆదిశగా అనతికాలంలో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. దేవదాయశాఖ నుంచి రూ. 8 కోట్లు మంజూరు చేయడంతో ప్రస్తుతం శరవేగంగా పనులు జరుగుతున్నాయి.మొత్తం గ్రానైట్‌రాళ్లతో పనులు చేస్తున్నారు. చైన్నెకి చెందిన ఆలయాల నిర్మాణ నిపుణులతో పనులు చేయిస్తున్నారు. ఆలయంలోని మూలవిరాట్‌ను అలాగే ఉంచి, మిగతా కట్టడాలన్నీ తొలగించి పూర్వఆలయం ఎలా ఉందో అలాగే నిర్మిస్తున్నారు.



జరుగుతున్న ఆలయ పునర్‌నిర్మాణ పనులు

దివ్యాంగ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

వింజమూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రతీ దివ్యాంగ విద్యార్థి విద్యావంతుడు కావాలని, వారికున్న శారీరక, ఆరోగ్య సమస్యలు విద్యకు దూరం చేయకూడదని, అందుకు అనుగుణంగా కేంద్రం మార్గదర్శకాలు రూపొందించిందని కేంద్ర సామాజిక న్యాయ సాధికారిత మంత్రిత్వశాఖ జాతీయ నిధి సభ్యుడు వీ. శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 9, 10 తరగతుల విద్యార్థులు ఈనెల 31లోపు, ఆపై చదువుతున్న విద్యార్థులు అక్టోబరు 31లోపు స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9636
వెండి కిలో ధర	రూ. 119800
వెండి ఒక గ్రాము	రూ. 122.80

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మహర్దశ

- పీఎం ఉష పథకం కింద రూ.5 కోట్ల నిధులు
- వేగంగా కొనసాగుతున్న పనులు

ఉదయగిరి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మహర్దశ పట్టింది. 2024-25 సంవత్సరంలో కళాశాల అభివృద్ధికి ప్రధానమంత్రి ఉష పథకం కింద ప్రభుత్వం రూ.5 కోట్లు నిధులు కేటాయించింది. ఇది నియోజకవర్గంలో ఏకైక ప్రభుత్వ డిగ్రీ కళాశాల కావడం విశేషం. ఈ ప్రాంతంలో అధికంగా పేదవారు ఉండడంతో తమ పిల్లలను దూర ప్రాంతాలకు పంపలేక డిగ్రీ చదువుకు ఈ కళాశాలలోనే చేర్పిస్తారు. అయితే కళాశాలలో తగినన్ని తరగతి గదులు, ల్యాబ్ సౌకర్యం లేక అవస్థలు పడేవారు. ప్రభుత్వ నిధులు మంజూరు చేయడంతో అన్ని వసతులు సమకూరనున్నాయి.

● వేగంగా పనులు

ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదుగా ప్రారంభించిన పనులు వేగంగా సాగుతున్నాయి. పీఎం ఉష పథకం మంజూరైన రూ.5 కోట్ల నిధుల్లో రూ.3.50 కోట్లతో అదనపు తరగతి గదులు, రూ.75 లక్షలతో ల్యాబ్‌లో సౌకర్యాలు, రూ.75 లక్షలతో ప్రస్తుతం ఉన్న తరగతి గదుల మరమ్మతులు చేపడుతున్నారు. ఇప్పటికే ప్రస్తుతం ఉన్న తరగతి గదుల పనులు పూర్తయ్యాయి. నూతనంగా నిర్మించనున్న అదనపు తరగతి భవనాల నిర్మాణాలు పనులు సాగుతున్నాయి. ఎమ్మెల్యే సూచన మేరకు పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటిస్తూ కళాశాల చుట్టూ జంగిల్ క్లియరెన్స్ చేయించి హద్దులు సైతం ఏర్పాటు చేశారు. అయితే బిల్లుల మంజూరులో జాప్యం జరుగుతోందని అధ్యాపకులు తెలుపుతున్నారు.

400 మంది విద్యార్థుల విద్యాభ్యాసం

కళాశాలలో 400 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారికి 18 తరగతి గదులకుగాను 12, 5 ల్యాబ్‌లనుగాను 3 మాత్రమే ఉన్నాయి. అధ్యాపకుల కొరత లేదు. విద్యార్థులకు తాగునీరు, టాయిలెట్స్ సౌకర్యం సమృద్ధిగా ఉన్నాయి. పీఎం ఉష పథకం కింద కళాశాలలో జరుగుతున్న పనులు పూర్తయితే అన్నీ వసతులు అందుబాటులోకి వస్తాయి.



కళాశాలలో జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణం



-డాక్టర్ ఎల్.నారాయణస్వామి, ప్రిన్సిపాల్

సంగంలో ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

సంగం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాలను డీఆర్సీ ఏడీఏ అధికారి దేవసేన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిల్వ ఉన్న ఎరువులు, స్టాకు రిజిష్టర్, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యూరియాను దారి మళ్లించి కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి శశిధర్, వీపీఏలు పాల్గొన్నారు.

మంత్రి ఆనంను కలిసిన ఆలయాల చైర్మన్లు

సంగం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగల్లు భీమేశ్వరాలయం, మర్రిపాడులోని చెన్నకేశవస్వామి ఆలయాల చైర్మన్లుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన పగడాల రఘురామయ్య, ఎం హరిరెడ్డి మంగళవారం మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని నెల్లూరులోని ఆయన క్యాంపు ఆఫీసులో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆయనకు శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు.

స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ

సంగం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమరపునాయుడు కండ్రిక, వెంకటేశ్వరపురంలో టీడీపీ మండల అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి మంగళవారం స్మార్ట్ రైస్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ మహిళలు పాల్గొని స్మార్ట్ కార్డులను ప్రదర్శించారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

ఉదయగిరి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ తెలిపారు. మంగళవారం మండలంలోని వెంగళరావునగర్, ఉదయగిరి-2 రైతుసేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాగులో ఉన్న పంటలను పరిశీలించి రైతులకు సలహాలు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గంధోత్సవ గోడపత్రిక ఆవిష్కరణ



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

అనంతసాగరం ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో వెలసిన హజరత్ మష్కూర్ అలిషాఖాదరీ దర్గా గంధమహోత్సవ గోడపత్రికను మంగళవారం నిర్వాహకులు విడుదల చేశారు. వచ్చే నెల 16 నుంచి మూడు రోజులపాటు వేడుకలు జరుగుతాయని సానిసాహబ్, మజీద్‌సాహెబ్ తెలిపారు.

మహిళా సమానత్వ దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

ఉదయగిరి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళా సమానత్వ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.నారాయణస్వామి మాట్లాడుతూ మహిళల అభివృద్ధి లేకుండా సమాజాభివృద్ధి సాధ్యం కాదన్నారు. అనంతరం మహిళా అధ్యాపకులు తమ అనుభవాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఏ.నరసింహులు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ కేసీ విక్రమ్, మహిళాశక్తి ప్రబోధన సెల్ కన్వీనర్ రాధిక, అధ్యాపకులు పద్మజ, పుష్పమ్మ లక్ష్మీ పాల్గొన్నారు.

గ్రామాలకు తరలిన గణనాథులు

● వాడవాడలా చవితి వేడుకలకు ముస్తాబు ● పండుగ సామగ్రి కొనుగోళ్లతో పట్టణాలన్నీ కిటకిట



ఉదయగిరి : వినాయక విగ్రహాన్ని తరలిస్తున్న ఉత్సవ కమిటీ



సంగం : వినాయక విగ్రహాన్ని మండపంలో దించుతున్న ఎక్స్‌కవేటర్



ఆత్మకూరులో పూజాసామగ్రిని కొనుగోలు చేస్తున్న భక్తులు

ఉదయగిరి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం నిర్వహించనున్న వినాయకచవితి వేడుకలకు గణనాథులను ప్రతిష్ఠించేందుకు మంగళవారం ఉదయగిరి నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలించారు. ఉత్సవ కమిటీ గ్రామాల్లో మండపాలు ఏర్పాటు చేసి పోటాపోటీగా విగ్రహాల ఏర్పాటుకు సన్నద్ధమైంది. ఉదయగిరిలో విగ్రహాల కొనుగోలు, పూజాసామగ్రి దుకాణాల వద్ద భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు విగ్రహాలను ఉదయగిరి, పామూరు, వింజమూరు, కావలి తదితర ప్రాంతాల్లో కొనుగోలు చేసి ప్రత్యేక వాహనాల్లో గ్రామాలకు తరలించారు.

ఆత్మకూరు : నియోజకవర్గంలోని అన్నీ మండలాల ల్లో బుధవారం నుంచి వినాయకచవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు భక్తులు సన్నద్ధమయ్యారు. ఉత్సవాల నిర్వహణకు కమిటీలను ఏర్పాటు చేసుకొని ఏర్పాట్లు పూర్తి చేశారు. మూడురోజులపాటు ఉత్సవాలను చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నారు. ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం, తీన్‌మార్ దప్పులు, బాణసంచా కాల్చేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. గ్రామాల్లో తాత్కాలికంగా ప్రతిష్ఠించే వినాయక విగ్రహాలను పలు ప్రాంతాల్లో కొనుగోలు చేసిన నిర్వాహకులు మంగళవారం తమ గ్రామాలకు తరలించారు. పట్టణ ప్రజలు సైతం విగ్రహాలను, పూజాసామగ్రిని కొనుగోలు చేసి ఇళ్లకు తీసుకెళ్లారు.

సంగం : మండలంలోని వాడవాడలా వినాయక చవితి వేడుకలకు అన్నీ సిద్ధం చేశారు. పలు కాలనీల్లోని ఆలయాల వద్ద, కూడళ్లలో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేయడం ఆనవాయితీ. బుధవారం జరిగే పండుగకు యువకులు వినాయక విగ్రహాలను గ్రామాలకు తరలిస్తున్నారు. మట్టి వినాయక బొమ్మలు, పూజా సామగ్రిని సంగం బస్టాండ్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. వీటిని కొనేందుకు జనాల రావడంతో రద్దీగా మారింది.

శానిటేషన్‌పై సీఆర్పీలకు అవగాహన



సంగం : అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో షాలెట్

సంగం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శానిటేషన్‌పై కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లకు మంగళవారం శిక్షణ నిర్వహించారు. ప్రతీ వెయ్యి కుటుంబాలకు ఓ సీఆర్పీ లెక్కన 12 మందిని ఎంపిక చేసి నియమించారు. వీరికి ఎంపీడీవో షాలెట్ శానిటేషన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వరప్రసాద్, ఏపీఎం రవిశంకర్‌రెడ్డి, సంగం సెక్రటరీ నరసయ్య, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

● ఉదయగిరి : మండలంలోని 17 పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యం మెరుగుపై దృష్టి సారించాలని ఎంపీడీవో అప్జాజీ మంగళవారం తెలిపారు. గ్రామాల్లో చవితి ఉత్సవాలు జరుగుతున్నందున మురికి ప్రాంతాలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లించాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు.

ఫ్లోరోసిస్ బాధితులపై సర్వే

కలువాయి, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): మండలంలో ఫ్లోరోసిస్ ప్రభావిత గ్రామాలైన చీపినాపి, పర్లకొండ గ్రామాల్లో మంగళవారం వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు సర్వే నిర్వహించారు. జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంటు డాక్టర్ దివ్య ఆధ్వర్యంలో వైద్యుల బృందం పాఠశాలలో విద్యార్థులను పరిక్షించారు. పళ్ల మీద మచ్చలు ఏర్పడిన దశలోనే వ్యాధిని గుర్తించి వైద్యం చేయాలని సిబ్బందికి వైద్యులు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్ దివ్య, బృందం

పేరుకే పెట్రోలు బంకు... ఎప్పుడూ మూతే !



వినియోగంలో లేని పెట్రోల్ బంకు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెంలో ఆర్భాటంగా పెట్రోలు బంకును ఏర్పటు చేసినా, తొలి నుంచి అక్కడి సేవలు ఊరిస్తూనే ఉన్నాయి. ఎప్పుడు పెట్రోలు, డీజిల్ ఉంటుందో, ఎప్పుడు తాళాలు వేస్తారో తెలియని అయోమయ పరిస్థితుల్లో వినియోగదారులు ఉన్నారు. ఉదయగిరి, వరికుంటపాడు మండలాల సరిహద్దు గ్రామం కావడంతో ప్రతినిత్యం పలువురు వినియోగదారులు అక్కడికి పరుగులు తీసినా ఫలితం లేకుండా పోతుంది. కనీసం సమాచారం చెప్పే దిక్కు కూడా లేకపోవడంతో గంటల తరబడి అక్కడే ఎదురు చూడాల్సి వస్తుంది. తీరా విషయం తెలుసుకొని చేసేదేమిలేక నిరాశగా వెనుతిరగాల్సిన దుస్థితి నెలకొంది. ఇటీవల 20 రోజులకుపైగా ఆ బంకు వినియోగంలో లేకపోవడం విశేషం. అవసర నిమిత్తం తప్పనిసరి పరిస్థితుల్లో కొంతమంది స్థానిక దుకాణాల్లో అదనపు నగదు చెల్లించి కొనుగోలు చేస్తుండగా, మరికొంతమంది ఉదయగిరి, వరికుంటపాడు, ప్రకాశం జిల్లా పామూరు వంటి పట్టణాలకు పరుగులు తీస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పెట్రోలు బంకు వినియోగదారులకు నిరంతరాయంగా సేవలు అందేలా చర్యలు చేపట్టాలి.

ఉదయగిరిని జిల్లా చేయాలని వినతి



తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేస్తున్న మండల వైసీపీ నాయకులు

సీతారామపురం,ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఉదయగిరిని జిల్లా చేయాలని కోరుతూ ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, వైసీపీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి , మండల వైసీపీ నేతలు మంగళవారం తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మూడు జిల్లాల సరిహద్దుల్లో ఉండి, నిత్యం కరువు కాటకాలతో అల్లాడుతూ పాలకుల నిర్లక్ష్యానికి గురిఅయిన ఉదయగిరి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడపాలంటే ఉదయగిరి జిల్లా చేయాలన్నారు. గత ఆరేళ్లుగా ఉదయగిరి జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యంలో ఎన్నో ఉద్యమాలు జరుగుతూ ఉన్నాయన్నారు. ఎన్నో విజ్ఞాపనలు పాలకులకు అందజేశామన్నారు. ఇటీవల సాధన కమిటీ పిలుపు మేరకు ఈ ప్రాంతంలో ఉన్న రాజకీయ పార్టీల నాయకులు మంత్రివర్గ ఉపసంఘానికి వినతిపత్రాలను పంపించాయన్నారు. ఇప్పుడు కూడా తహసీల్దార్‌ను కోరామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఆర్. తిరుపతయ్య, నాయకులు దుర్గయ్య, బాలినేని మాబయ్య, పాణెం చంద్రమౌళి, ధనార్జున్,బ్రహ్మయ్య, కాశీంపీరా తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు



ప్రధానోపాధ్యాయురాలిని సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు

సీతారామపురం , ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ మండల శాఖ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా కార్యదర్శి ఎడమ తిరుపతయ్య ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు భోగ్యం శ్రీనివాసులు మాట్లాడుతూ వెంటనే పీఆర్సీ కమిటీని నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలలో 2 డీఏలను వెంటనే ప్రకటించాలని, అసెస్మెంట్ బుక్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని అమలు చేయాలని, విద్యాశాఖలోని కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులైజ్ చేయాలని, బోధనేతర పనులను తగ్గించి, బోధనకు సమయం ఉండేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు రంతుజాని, జిల్లా కౌన్సిలర్ పేరాల శ్రీనివాసులు, కార్యదర్శులు మహేష్‌సారే సురేష్, యగతీల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.అనంతరం పాఠశాల హెచ్‌ఎంను సన్మానించారు.

స్మార్ట్ రేషన్ కార్డులతో అక్రమాలకు చెక్

● మున్సిపల్ మంత్రి నారాయణ

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ రేషన్ కార్డులతో రేషన్ అక్రమాలకు చెక్ పడుతుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. నగరం లోని పొర్లుకట్టలో మంగళవారం ఆయన లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థను పారదర్శకంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఈ కార్య క్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఎస్వో విజయకుమార్, పౌరసర ఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, ఆర్డీవో అనూష, నాయకులు పాల్గొన్నారు. కాగా, కిలో మీద తమకిస్తున్న కమీషన్‌ను రూ2కు పెంచాలని నెల్లూరు జిల్లా చౌకధరల దుకాణాదారుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు పోబోలు వెంకట సుబ్బయ్య మంత్రి నారాయణకు వినతిపత్రం ఇచ్చారు.

C.R.I.M.E N.E.W.S

రైల్లో నుంచి పడి జార్ఖండ్ వాసి మృతి



సోమ్రా నాగేసియా మృతదేహం

కావలి రూరల్, ఆగస్టు 26(ఆంధ్ర జ్యోతి): కావలి పట్టణం మద్దూరు పాడు సమీపంలో దిగువమార్గంలోని రైలు పట్టాలపై సోమ్రా నాగేసియా (30) మృతదేహాన్ని మంగళవారం ఉదయం కీమెన్ గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్‌ఐ కే.వెంకట్రావ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి పట్టాలపై మృతదేహం పడి ఉన్న తీరును బట్టి గుర్తు తెలియని రైల్లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెంది ఉండ వచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. మృతుడి వద్ద లభించిన ఆధారాల ప్రకారం జార్ఖండ్ వాసిగా గుర్తించి మృతుడి బంధు వులకు సమాచారమిచారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి భద్రపరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి ..

కావలిరూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ పరిధిలోని ముసునూరు టోల్‌గేట్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కావలి రూరల్ పోలీసుల కథనం మేరకు.. బోగోలు మండలం పాత బిట్రగుంటకు చెందిన కందుకూరి రాగేశ్వరరావు(68) పూల వ్యాపారంతో పాటు ఆలయాల్లో పూల డెకరేషన్ చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో కావలి పట్టణంలోని ఓ ఆలయంలో పూల డెకరేషన్ చేసేందుకు సోమవారం రాత్రి ఒప్పందం కుదుర్చుకున్నాడు. అక్కడి నుంచి మోటారు బైక్‌పై తమ గ్రామానికి వెళ్తుండగా టోల్‌గేట్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన రాగేశ్వరరావును చికిత్స నిమిత్తం 108 వాహనంలో పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించగా అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతుడి భార్య పరమేశ్వరి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా రూరల్ ఎస్‌ఐ తిరుమలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శివలింగం చోరీ కేసులో నిందితుల అరెస్టు

అల్లూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : శివలింగం చోరీ కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా న్యాయాధికారి రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు రెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని నార్తుఆములూరు-గొల్లపాలెం సమీపంలోని శివాలయంలో ఈ నెల 15వ తేదీన శివలింగం చోరీకి గురైంది. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టగా కోవూరు, పడుగుపాడు ప్రాంతాలకు చెందిన ఉమ్మడిశెట్టి హరికృష్ణ, షేక్ వాజిద్ అహ్మద్, పాండిచ్చేరి కుమార్, యాటగిరి శ్రీనివాసులు, అనంతపురం జిల్లా ముదిగుబ్బకు చెందిన శ్రీనివాసులులు ముఠాగా ఏర్పడి ఆరోజు అర్ధరాత్రి 11 గంటల సమయంలో మినీ వ్యాన్‌లో వచ్చి శివాయలం ఎదురుగా నిలిపారు. ఎవరూ లేని విషయాన్ని గమనించి లోపలికి వెళ్లి గడ్డపారలతో శివలింగం చుట్టూ తవ్వి శివలింగాన్ని తమ వాహనంలో తీసుకెళ్లారు. కోవూరు గ్రామ శివారులోని నిర్మానుష్య ప్రాంతంలో ఆ శివలింగంను పగలగొట్టి అందులోని ఉన్న రాగి నాణేలను అపహరించుకెళ్లారు. ఈ ఘటనపై నమోదైన కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

లైంగిక దాడి కేసులో ఐదేళ్ల జైలు, జరిమానా

నెల్లూరు (లీగల్), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న కేసులో నేరం రుజువు కావడంతో పాదర్తి విద్యా సాగర్ అలియాస్ కామయ్య అనే నిందితుడికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష తోపాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కావలి మండలం ముసునూరు గ్రామానికి చెందిన నిందితుడు కామయ్య అదే గ్రామానికి చెందిన ఓ బాలికపై 2017 డిసెంబరు 13న లైంగిక దాడికి యత్నించాడు. ఈ మేరకు కావలి రూరల్ పోలీసులు నిందితుడిపై పోక్సో యాక్ట్ కింది కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ చంద్రశేఖర్ వాదించారు.



డైమాండ్ డబ్బా నిర్వహిస్తున్న నిర్వాహకులు

కాయ్ రాజా.. కాయ్ !

- గొలగమూడిలో విచ్చలవిడిగా జూదం
- స్పందించని పోలీసులు,అధికారులు

వెంకటాచలం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన గొలగమూడి అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారింది. వెంకయ్యస్వామి 43వ ఆరాధనోత్సవాల్లో భాగంగా రెండురోజుల క్రితం కంటేపల్లి మార్గంలోని క్రికెట్ మైదానంలో ఏర్పాటు చేసిన జాయింట్ వీల్స్ (ఉయ్యాల) వద్ద డైమాండ్ డబ్బాను యథేచ్ఛగా నిర్వహించారు. ఈ జూదం ఆడేందుకు యువత పోటీ పడ్డారు. అయితే కొందరు స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా వారు సత్వరమే స్పందించలేదు.దీంతో నిర్వాహకులు ఇదే అదునుగా మరీ రెచ్చిపోయారు. యువత నుంచి రూ.లక్షలు దోచుకున్నారు. డబ్బులు పోగొట్టుకున్న యువత మాత్రం లబోదిబోమన్నారు. ఒకానొక దశలో డబ్బులు పోగొట్టుకున్న యువకులకు డైమాండ్ డబ్బా నిర్వాహకులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. గొలగమూడిలో ఇలా డైమాండ్ డబ్బా ఎలా నిర్వహిస్తారని, ఇలాంటి జూదాలు ఇక్కడ ఇలా నిర్వహించడం మంచికాదని కొందరు యువకులు వెళ్లి ప్రశ్నించారు. అయితే తాము అధికారులకు మామూళ్లు ఇచ్చే ఆటను నిర్వహిస్తున్నామని, ఎక్కడైనా, ఎవరికైనా ఫిర్యాదు చేసుకోవచ్చని నిర్వాహకులు సమాధానం ఇచ్చినట్లు సమాచారం. పోలీసులకు స్థానికులు సమాచారమిచ్చినా అప్పటికప్పుడు స్పందించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. డైమాండ్ డబ్బా నిర్వహిస్తున్న వీడియోలను కొందరు యువకులు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి డైమాండ్ డబ్బా వంటి జూదాలను నడిపించిన వారిపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	108
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220

కోడిగుడ్ల ధర (100): 540

నేతల వినాయక చవితి శుభాకాంక్షలు

కందుకూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజక వర్గ ప్రజలకు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, తూమాటి మాధవరావు, మాజీమంత్రి మానుగుంట మహీధరరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దివి శివరాం, బుర్రా మధుసూదన్‌యాదవ్ తదితరులు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

సచివాలయం తనిఖీ చేసిన ఎంపీడీవో

వలేటివారిపాలెం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయ్యవారిపల్లె సచివాలయాన్ని మంగళవారం ఎంపీడీవో నరేంద్రదేవ్ తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. సర్వేయర్ శింగయ్య విధులకు గైర్హాజరు కావడంతో జీతం నిలిపివేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. లబ్ధిదారులకు స్మార్ట్‌కార్డులను పంపిణీ చేశారు. అలాగే పోకూరు, అంకభూపాలపురం గ్రామాల్లో టీడీపీ నాయకులు ఎస్.తిరుమలరావు, ఎన్.సుబ్బానాయుడు, జీ.బెంజిమెన్, ఎం.నాగభూషణం, జీ.చెంచురామయ్య, బాబూరావులు స్మార్ట్‌కార్డులను పంపిణీ చేశారు.

పేద అర్చకుడికి ఆర్థిక సాయం

కావలి(టౌన్), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : ముసునూరు రామాలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న బాబురావు ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందిన పేద అర్చకుడి వైద్యం, ఇంటి ఖర్చులకు మంగళవారం కావలి బ్రాహ్మణ మహా సంఘం నేతలు రూ.29వేల ఆర్థిక సాయమందించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పీవీఎస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, గుర్తింపు కార్డుల పంపిణీ

బిట్రగుంట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం బిట్రగుంట పంచాయతీ కొండబిట్రగుంట ప్రాథమిక పాఠశాల్లోని విద్యార్థులకు ఆర్ఎస్ఆర్ ట్రస్ట్ కన్వీనర్ మెతుకు రాజేశ్వరమ్మ మంగళవారం టై, ఐడీ కార్డులను ఎంఈవో ఎం.జయమ్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అలాగే సరస్వతి నమస్తుభ్యం మండల చైర్మన్ ఎం.ప్రసాద్ రావు విద్యార్థులచే మట్టి వినాయక ప్రతిమలను తయారు చేయించారు. వారికి ప్రోత్సాహక బహుమతులను అందచేశారు. అదేవిధంగా ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయిని దేగా విజితను ప్రధానోపాధ్యాయులు సీహెచ్ సుజాత సన్మానించారు. ఈ కార్యక్రమంలో సహోపాధ్యాయులు వీవీ బ్రహ్మయ్య, విజయ లక్ష్మీ, సీఆర్పీలు రవి, చెన్నయ్య ఉన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

అల్లూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఇంటర్నల్ స్క్వాడ్ అధికారులు హెచ్చరించారు. మండలంలో మంగళవారం ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో రికార్డులు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వింజమూరు, కావలి వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.శేషగిరి, నాగరాజు, అల్లూరు వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లులు పాల్గొన్నారు.

వాడవాడలా 'చవితి' సందడి



పూజా సామగ్రి విక్రయిస్తున్న చిరు వ్యాపారులు

కావలి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని పురస్కరించుకుని మంగళవారం నుంచే వాడవాడలా సందడి నెలకొంది. పూజాసామగ్రి, వివిధ ఆకృతులలోని వినాయకుని ప్రతిమలతో కావలి పట్టణం కళకళలాడుతోంది. పట్టణంలో ట్రంకురోడ్డుకు ఇరువైపులా దానికి అనుబంధంగా ఉన్న రోడ్లలో గణనాథుని పూజకు అవసరమైన గణనాథుని చిన్న చిన్న ప్రతిమలతో పాటు అన్ని రకాల పూజా సామగ్రితో ట్రంకురోడ్డు నిండి పోయింది. మంగళవారం సాయంత్రం నుంచే ప్రజలు వినాయకచవితి పూజకు అవసరమైన అన్ని రకాల పూజా సామగ్రి కొనుగోలుకు ట్రంకు రోడ్డుకు చేరు కోవటంతో ప్రజలతో కిటకిట లాడుతోంది. రోడ్డుకు ఎటు వైపు చూసినా వినాయక ప్రతిమలు, అరటి పిలకలు, వాటికి అవసరమైన గొడుగులు, వివిధ రకాల ఆకులు, ఫలాలు తదితర అన్ని వస్తువులు అందుబాటులో ఉంచటంతో పట్టణం ఆకర్షణీయంగా కనిపించింది.

ఉచితంగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

కావలి మండల ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్ సౌజన్యంతో మంగళవారం సాయంత్రం స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఉచితంగా వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక ప్రతిమలను విజయవాడ నుంచి ప్రత్యేకంగా తెప్పించి ప్రతిమలతోపాటు వినాయక పూజకు సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్త, ఓరుగంటి రామకృష్ణ, కంచర్ల చక్రి, గాదంశెట్టి మధుసూదనరావు, బచ్చు వీరా స్వామి, యేల్చూరి రవి తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

కందుకూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పర్యావరణహిత మట్టి వినాయకులను మంగళవారం అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో కనిగిరి రోడ్డులో పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవాసంఘం సభ్యులు కేఎస్ వెంకటేశ్వర్లు, నల్లబోతుల మురళి, మాదాల వెంకటేశ్వర్లు, కాటా చెంచురామయ్య, దాసరి శ్రీను, ఉన్నం వీరాస్వామి, చక్కా కేశవ పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పెద్దబజారులో బోణాల శ్రీనివా సచక్రవర్తిలు మట్టి విగ్రహాల పంపిణీ చేశారు.

గ్రామాలకు తరలిన గణనాథులు

కలిగిరి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తయారీ కేంద్రాల నుంచి గణనాథులు మంగళవారం గ్రామాలకు తరలివెళ్లారు. యువత ట్రాక్టర్లు, ఆటోలను తీసుకువచ్చి తాము కొనుగోలు చేసిన వినాయక విగ్రహాలకు కాయ కర్పూరంతో పూజా కార్యాక్రమాలు నిర్వహించి తరలించారు. దీంతో గ్రామాల్లో పండగ సందడి మొదలైంది.

వినాయకుడిని పూజించడం శుభప్రదం



విగ్రహాలను కొనుగోలు చేస్తున్న టీడీపీ నేతలు

బిట్రగుంట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ముక్కోటి దేవతలలో ప్రథమ పూజలందుకునే వినాయకస్వామిని పూజించడం శుభప్రదమని టీడీపీ మండల రైతు నాయకుడు ఇందుపూరు రామోహన్‌రెడ్డి అన్నారు. బోగోలు మండలం కోవూరుపల్లి పంచాయతీలోని గిరిజన, అంబేడ్కర్, హరిజనవాడలకు వినాయక విగ్రహాలను వితరణ చేశారు. మంగళవారం విగ్రహాలను కొనుగోలు చేసి నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు నాటకరాణి రంగయ్య, భాస్కర్, శీనయ్య, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల వేషధారణ



గణపతి వేషధారణలో విద్యార్థులు

అల్లూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని నార్తుమోపూరులోని శ్రీచైతన్య విద్యాసంస్థల్లో మంగళవారం వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు గణపతి వేషధారణలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. గణపతి వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శివకుమార్, ఖాజారంతుల్లా పాల్గొన్నారు.

ముందస్తు వేడుకలు



మేదరమెట్లపాలెం అంగన్వాడీ కేంద్రంలో పూజలు చేస్తున్న ఐసీడీఎస్, అంగన్వాడీ సిబ్బంది

లింగసముద్రం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదపవని సెక్టార్ పరిధిలోని మేదరమెట్లపాలెం అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం ముందస్తు వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఏవీ రాధాదేవి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు గణనాథుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఉండ్రాళ్లు, కుడుములు, లడ్డూలు, పులిహోర నైవేద్యంగా సమర్పించారు.

● **వలేటివారిపాలెం:** మండలంలోని నేకునాంపురం అంగన్‌వాడీ కేంద్రంలో వినాయకుడు విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రవి, పంచాయతీ కార్యదర్శి నాగమణి, అంగన్వాడీ కార్యకర్తలు రాధ, భారతి పాల్గొన్నారు.



నేకునాంపురంలో వినాయచవితి వేడుకలు నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రతీ వీధిలో గణేశ్ ప్రతిమల ఏర్పాటు

కావలి(టౌన్),ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రతీ విధిలో వినాయక విగ్రహాల ఏర్పాటు చేస్తున్నారు. ముసునూరులో ఉన్న విగ్రహాల తయారీ కేంద్రాల వద్ద మంగళవారం యువత విగ్రహాలు కొనుగోలు చేసి వాహనాల్లో తరలించారు. పట్టణంలోని ప్రతి వీధిలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. వస్త్ర వ్యాపార సముదాయాల్లో, ప్రధాన కూడళ్లలో ప్రత్యేక సెట్టింగులు, విద్యుదీపాలంకరణలతో ఆకర్షణీయంగా ముస్తాబు చేశారు. పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్ పర్యవేక్షణలో పెద్దఎత్తున చవితి వేడుకలకు ఏర్పాట్లు చేశారు. మానస సెంటర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో భారీ ఎత్తున ప్రతిష్టాత్మకంగా ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.



గణపయ్య ప్రతిమలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత సులభతరం



కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి, సబ్ కలెక్టరు హిమవంశీ

కందుకూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత సులభతరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, అందులో భాగంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలందరికీ స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్నారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని 1వ వార్డు ఏకలవ్యనగర్‌లో మంగళవారం ఉదయం సబ్ కలెక్టరు దామెర హిమవంశీతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి స్మార్ట్‌రేషన్‌కార్డుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.అనూష, తహసీల్దారు లావణ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, నాయకులు కృష్ణారెడ్డి, ఉప్పుటూరి శ్రీనివాసరావు, పొడపాటి మాధవ, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉన్నం వీరాస్వామి పాల్గొన్నారు.

'ఉల్లాస్ అక్షర ఆంధ్ర'కు జీవం పోయాలి

అల్లూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమానికి జీవం పోయాలని అడల్ట్ ఎడ్యుకేషనల్ డివిజినల్ సూపర్‌వైజర్ ఓంకారం శిరీష అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వలంటీర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు వెలుగు పరిధిలో 150 మందిని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పరిధిలో 100 మందిని వలంటీర్లుగా ఎంపిక చేయనున్నారన్నారు. శిక్షణ తీసుకున్న వలంటీర్లు ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, ఎన్ఆర్ఈజీఎస్ శాఖల అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, ఇన్‌చార్జి ఎంపీడీవో పెంచల వీరేంద్ర, ఎంఈవో రవీంద్రనాథ్, రిసోర్స్ పర్సన్ నాగరాజారావు, ఏపీఎం ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా జయంతి వేడుకలు



మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాల వేస్తున్న డాక్టర్ ప్రభాకర్ నాయుడు

కావలి(టౌన్), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): విశ్వమాత మదర్ థెరిస్సా జయంతి వేడుకలను మంగళవారం డాక్టర్ ప్రభాకర్ నాయుడు ఆసుపత్రి వద్ద వివిధ స్వచ్ఛంద సంస్థల వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్మన్, డాక్టర్ ప్రభాకర్ నాయుడు ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వేదిక గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషా, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ప్రసాదరావు, దిలీప్, సలీమ్, సురేంద్ర, ఘనీబాషా, రఫీ అహ్మద్, మాల్యాద్రి నాయుడు, మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బుధవారం 27 ఆగస్టు 2025

వినాయక చవితి శుభాకాంక్షలు

తిరుమల/తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు మంగళవారం ఓ ప్రకటన ద్వారా భక్తులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. భక్తులు చేపట్టే శుభకార్యాలన్నింటికీ విఘ్నాలు తొలగి విజయాలు చేకూరాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, పనబాక లక్ష్మీ, ఎక్స్ అఫిషియో సభ్యుడు దివాకర్‌రెడ్డి కూడా వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ వెంకటేశ్వర్ కూడా ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ అధ్యక్ష పదవికి పెరిగిన పోటీ



● టీడీపీ పార్లమెంటు సమావేశంలో మంత్రి సవిత

నరసింహ యాదవ్ కొనసాగితే అభ్యంతరం లేదన్న మెజారిటీ నేతలు

లేకుంటే శ్రీధర్ వర్మకు అవకాశం ఇవ్వాలని అత్యధికుల సూచన

రేసులో మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ సహా పలువురు నేతలు

తిరుపతి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్ష పదవికి పోటీ పెరిగిపోయింది. రేణిగుంటలోని వై కన్వెన్షన్ హాలులో మంగళవారం జరిగిన టీడీపీ పార్లమెంటు విస్తృత స్థాయి సమావేశంలో త్రీ మెన్ కమిటీ సభ్యులైన మంత్రి సవిత, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాం ప్రసాద్ పాల్గొన్నారు. వివిధ పదవులకు నాయకుల అభిప్రాయాలను సేకరించారు. ఆశావహుల నుంచి దరఖాస్తులు, వినతి పత్రాలు, సిఫారసు లేఖలు స్వీకరించారు. ప్రస్తుత పార్లమెంటు కమిటీ అధ్యక్షుడు నరసింహ యాదవ్‌ను కొనసాగించాలని అధిష్ఠానం భావిస్తే అభ్యంతరం లేదని ఎక్కువ మంది నేతలు అభిప్రాయపడ్డారు. ఆ పదవిలో ఆయన పనితీరు పట్ల కూడా పలువురు సంతృప్తి వ్యక్తం చేశారు. వెంకటగిరి, గూడూరు, సూళ్ళూరుపేట ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్ కుమార్, డాక్టర్ విజయశ్రీతో పాటు సత్యవేడు ఇంఛార్జి శంకర్‌రెడ్డి కూడా నరసింహ యాదవ్ కొనసాగింపునకు మద్దతు పలికారు. ఒకవేళ ఆయన్ను మార్చాలని నిర్ణయించే పక్షంలో శ్రీధర్ వర్మకు అధ్యక్ష పదవి కేటాయించాలని అత్యధిక నేతలు సూచించారు. ఆశావహులలో యువకుడు కావడం, చురుగ్గా పనిచేస్తుండం, జిల్లావ్యాప్తంగా పార్టీ శ్రేణులతో పరిచయాలు కలిగివుండడం, ఎమ్మెల్యేలతో సత్సంబంధాలు కలిగి సమన్వయం చేసుకోగలిగిన పరిస్థితి ఉందంటూ అనుకూలతలను వారు ప్రస్తావించారు. మరోవైపు శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, ప్రస్తుత ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి కూడా తమకు అవకాశం కల్పించాలని కోరారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం అనారోగ్యంతో సమావేశానికి రాకపోయినప్పటికీ తన ప్రతిపాదనలను త్రీ మెన్ కమిటీకి పంపించారు. సత్యవేడు నియోజకవర్గం పిచ్చాటూరు నుంచీ సతీష్ నాయుడు, శ్రీకాళహస్తి నుంచీ గురవారెడ్డి, తిరుపతిలో సీనియర్ నేత సూరా సుధాకర్‌రెడ్డి, బుల్లెట్ రమణ, దంపూరి భాస్కర్ యాదవ్, మబ్బు దేవనారాయణరెడ్డి, పుష్పావతి యాదవ్ తదితరుల పేర్లు కూడా అధ్యక్ష పదవికి పరిశీలించాలంటూ త్రీ మెన్ కమిటీకి ప్రతిపాదనలు అందాయి. వీరిలో ఎస్సీవీ నాయుడు ప్రజా బలం, అర్థబలం, రాజకీయ అనుభవం కలిగిన నాయకుడైనప్పటికీ వయసు ప్రతిబంధకం అవుతున్నట్టు సమాచారం. తిరుపతి సీనియర్ నేత సూరా సుధాకర్‌రెడ్డి విషయంలోనూ అదే పరిస్థితి వున్నట్టు తెలుస్తోంది. కాగా త్రీ మెన్ కమిటీ మొత్తంగా తమకందిన దరఖాస్తులను, ప్రతిపాదనలను, సిఫారసులను అధిష్ఠానానికి పంపించింది.

క్లిష్టకాలంలో కష్టపడిన వారికే పదవులు

తిరుపతి, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీకి అండగా కష్టపడ్డవారికే పదవులు దక్కుతాయని మంత్రి సవిత చెప్పారు. మంగళవారం రేణిగుంటలోని వైకన్వెన్షన్ సెంటర్‌లో టీడీపీ పార్లమెంటు విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఆమెతోపాటు ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చిరాంప్రసాద్‌లు త్రీమెన్ కమిటీ సభ్యులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా సవిత మాట్లాడుతూ పదవుల కేటాయింపులో పారదర్శకత, సామాజిక న్యాయం పాటించాలని, యువతకు పెద్దపీట వేయాలన్నది సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ల ఉద్దేశమన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కొన్ని సమీకరణాల వలన టికెట్ త్యాగం చేసినవారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. కష్టకాలంలో పార్టీ పక్షాన పోరాడి జైలు కెళ్లినవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. పార్లమెంటు అధ్యక్షుడిగా నరసింహ యాదవ్‌ను కొనసాగించాలా? లేదా కొత్తవారికి ఇవ్వాలా? అనే అంశంపై పార్టీ నిర్ణయం తీసుకుంటుందని త్రీమెన్ కమిటీ సభ్యులు చెప్పినట్టు తెలిసింది. పార్లమెంటు కమిటీతో పాటు, అనుబంధ కమిటీలలో స్థానం కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కమిటీ కీలక పదవికి శ్రీధర్‌వర్మ, సూరా సుధాకర్ రెడ్డి, దంపూరి భాస్కర్ యాదవ్, పుష్పావతి యాదవ్, బిజి కృష్ణ యాదవ్, గురవారెడ్డి తదితరులు పోటీపడినట్టు తెలిసింది. దాదాపు 18 అనుబంధ సంఘాల కమిటీల్లో నియోజకవర్గాలన్నింటికీ ప్రాతినిధ్యం కల్పించనున్నారు. సమావేశంలో వెంకటగిరి ఎమ్మెల్యే రామకృష్ణ, సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, గూడూరు ఎమ్మెల్యేల పాశం సునీల్, టీటీడీ పాలకమండలి సభ్యురాలు పనబాక లక్ష్మి, మాజీ మంత్రి పరసా రత్నం, తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు నీలాయపాళెం విజయకుమార్, రుద్రకోటి సదాశివం, బొమ్మల శ్రీధర్, అలాగే నరసింహ యాదవ్, కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి, నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి, ఊకా విజయకుమార్, పులిగోరు మురళి, విజయలక్ష్మి, మన్నెం శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'లక్ష'ణంగా స్త్రీశక్తి వినియోగం



మాట్లాడుతున్న ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం ప్రవేశపెట్టిన పదో రోజున జిల్లా వ్యాప్తంగా లక్ష మందికిపైగా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. ప్రయాణికుల్లో 1,04,810 మంది మహిళలు, 1,101మంది బాలికలు ఉన్నారు. వీరి టికెట్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి రూ.41.61లక్షలు రీయింబర్స్‌మెంట్ రావాల్సివుందని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. డిపోల వారీగా.. 14,399 (గూడూరు), 8,197 (మంగళం), 12,882 (పుత్తూరు), 12,898 (సత్యవేడు), 11,721 (శ్రీకాళహస్తి), 8,201 (సూళ్లూరుపేట), 10,652 (తిరుపతి), 14,107 (వెంకటగిరి), 12854 (వాకాడు) మంది ఒక్కరోజే స్త్రీశక్తి పథకాన్ని వినియోగించుకున్నారు. కాగా జిల్లా వ్యాప్తంగా టిక్కెట్ తీసుకుని 1,16,010 మంది బస్సులెక్కరు. వీరి ద్వారా రూ. 1.3కోట్లు రాబడి లభించింది.

స్త్రీ శక్తి విజయవంతంపై అభినందన

స్త్రీ శక్తి పథకం విజయవంతంపై ఏపీఎస్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెంగల్‌రెడ్డి జిల్లా అధికారులను,సిబ్బందిని అభినందించారు. మంగళవారం ఆయన మంగళం ఆర్టీసీ డిపోలో అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకం అంచనాలకు మించి అమలవుతోందన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోవు రోజుల్లో కూడా ప్రజలకు ఇబ్బంది కలగకుండా బస్సులు నడపాలని సూచించారు. తిరుమల బ్రహ్మోత్సవాలు విజయవంతం చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. సమావేశంలో ప్రజారవాణాధికారి జగదీష్, డిప్యూటీ సీటీఎం విశ్వనాధం, సీఎంఈ బాలాజీ, డిపోమేనేజర్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

'బార్'మంటున్నారు

దరఖాస్తుకు ముందుకురాని వ్యాపారులు

కొత్త పాలసీలోని నిబంధనతో వెనకడుగు

జిల్లాలో 29 బార్లకు 12 దరఖాస్తులు

29 వరకు గడువు పొడిగింపు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బార్లకు దరఖాస్తు చేసుకునేందుకు మద్యం వ్యాపారులు ముందుకు రావడంలేదు. నాలుగు దరఖాస్తులు చేసుకుంటేనే లాటరీ తీస్తామన్న నిబంధనతోనే ఈ పరిస్థితి తలెత్తిందని అంటారు. దీంతో బార్లకు దరఖాస్తు చేయాలంటూ గతంలో మద్యం షాపులకు దరఖాస్తు చేసిన వారందరికీ ఎక్సైజ్ అధికారులు మెసేజ్‌లు పంపినట్లు సమాచారం. జిల్లాలో మొత్తం 29 బార్లకు ఓపన్ కేటగిరి కింద నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తుకు మంగళవారం గడువుగా ప్రకటించింది. ఇప్పటి వరకు తిరుపతి డివిజన్ పరిధిలోని 22 బార్లకు 9 ఆఫ్‌లైన్, మూడు ఆన్‌లైన్ ద్వారా మొత్తం 12 దరఖాస్తులు వచ్చాయి. గూడూరు డివిజన్ పరిధిలో 7 బార్లకు ఒక దరఖాస్తు కూడా రాలేదు. బార్ల కోసం లాటరీలో పాల్గొనాలంటే మొదట ఉచితంగా ఎన్‌రోల్‌మెంటు చేసుకోవాలి. ఆ తర్వాత ప్రాసెసింగ్ ఫీజు కింద రూ 10,000 చెల్లించాలి. అనంతరం రూ.5 లక్షలు దరఖాస్తు ఫీజు చెల్లించిన లాటరీలో పాల్గొనే అవకాశం ఉంటుంది. కానీ, ప్రతి బార్‌కు నాలుగు దరఖాస్తులు సమర్పించాలనే నిబంధన ఉంచారు. నాట్ రీఫండబుల్ కావడంతో.. నాలుగు దరఖాస్తులకు రూ.20.4 లక్షలు వెచ్చించడానికి వ్యాపారులు సుముఖత చూపడంలేదు. మరోవైపు మద్యం దుకాణాలకు పర్మిట్ రూములు ఇవ్వడంతోనూ వెనకడుగు వేస్తున్నట్లు భావిస్తున్నారు. రాష్ట్రమంతటా ఇదే పరిస్థితి ఉండటంతో ప్రభుత్వం దరఖాస్తు గడువును ఈ నెల 29 వరకు పొడిగించింది. జిల్లాలో ఓపన్ కేటగిరీ కింద 29 బార్లు, రిజర్వేషన్ కింద గీత కార్మికులకు మరో మూడు బార్లు కేటాయించినట్లు ఈఎస్ నాగమల్లేశ్వర రెడ్డి చెప్పారు. దరఖాస్తుకు చివరి తేదిగా ఓపన్ కేటగిరి కింద 29వ తేది సాయంత్రం 6 గంటల వరకు, రిజర్వేషన్ కేటగిరీల కింద అదే రోజు సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు గడువు విధించారన్నారు. 30న లాటరీ ద్వారా బార్లు కేటాయించడానికి ఓపన్ కేటగిరీకి ఉదయం 8 గంటలకు, రిజర్వేషన్ కేటగిరీ కింద ఉదయం 10 గంటలకు ప్రాసస్ ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ లాటరీ ప్రక్రియ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రారంభమవుతుందన్నారు.

పారదర్శకంగా నిత్యావసర సరకుల పంపిణీ



స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

చంద్రగిరి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చౌక దుకాణాల ద్వారా పారదర్శకంగా నిత్యావసర సరుకులు పొందేందుకు స్మార్ట్ రైస్‌కార్డులు ఎంతగానో ఉపయోగపడుతాయని జిల్లాకలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. తొండవాడ పంచాయతీ లింగాలుగంట ఎస్టీకాలనీలో మంగళవారం ఆయన ఆర్డీవో రామ్మోహన్‌తో కలిసి మంగళవారం స్మార్ట్ రైస్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కాలనీవాసులతో మాట్లాడారు. పెన్షన్, రేషన్ సక్రమంగా అందుతున్నాయా అని వారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శివరామసుబ్బయ్య, టీడీపీ నాయకులు పులికంటి మోహన్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, ఉమాపతిరెడ్డి, రాఘవేంద్ర, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ రాక

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర గవర్నర్, ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ బుధవారం రానున్నారు. ఉదయం 10.30గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని రోడ్డు మార్గాన బయలుదేరి 11.30గంటలకు తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని దర్శించుకోనున్నారు. 12.15గంటలకు తిరుమల పద్మావతి అతిథిగృహానికి చేరుకుని శ్రీవారిని దర్శించుకోనున్నారు రాత్రి అక్కడ బస చేసి గురువారం ఉదయం 11.10గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని ముంబయి వెళ్లనున్నారు.

ఏపీఆర్‌సెట్ కన్వీనర్‌గా సురేంద్రబాబు



తిరుపతి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఏపీఆర్‌సెట్ కన్వీనర్‌గా ఎస్వీయూ లైబ్రరీ సైన్స్ ప్రొఫెసర్ కొంగర సురేంద్రబాబు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మెన్ నియామక ఉత్తర్వులు వెలువరించారు. సురేంద్రబాబును ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడులు అభినందించారు. సురేంద్రబాబు ప్రస్తుతం ఎస్వీయూ సెంట్రల్ లైబ్రరీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. బెస్ట్ లైబ్రేరియన్ అవార్డును పొందారు. పరీక్షల విభాగం డీన్‌గానూ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన పర్యవేక్షణలో 22 పీహెచ్‌డీ, 7 ఎంఫిల్ డిగ్రీలు పూర్తయ్యాయి. 38 పరిశోధనా వ్యాసాలు, 2 పుస్తకాలు రూపొందించారు.



మంగళవారం సాయంత్రం తిరుపతి గాంధీ రోడ్డులో రద్దీ

'వినాయక' సందడి

నగరంలో మంగళవారం ఎక్కడ చూసినా గణనాథుడి వేడుకల కోలాహలం కనిపించింది. విగ్రహాల కొనుగోలు, తరలింపు హడావిడి జాతరను తలపించింది. ముఖ్యంగా మంగళంలోని వినాయక విగ్రహాలను విక్రయించే బొమ్మలక్వార్టర్స్ ప్రాంతంలో చవితి కళ ప్రస్ఫుటమైంది. మూడు వీధుల దుకాణాల్లో కొనుగోలుదారుల జోరు ఉత్సవ సందడికి అద్దం పట్టింది. కొద్ది గంటల్లో చవితి సమీపించనుండటంతో నిర్వాహకులు వడివడిగా విగ్రహాలను మండపాలకు చేర్చి కొలువుదీర్చే పనిలో మునిగిపోయారు. వివిధ ఆకృతుల్లో ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్న విగ్రహాల్లో సింహభాగం అమ్ముడుపోవడంతో తయారీదారులు ఆనందం వ్యక్తం చేశారు. తిరుపతి, శెట్టిపల్లి, రేణిగుంట, కరకంబాడీ మీదుగా విగ్రహాలను తరలిస్తూ వాహనాలు క్యూకట్టాయి. - తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి











వినాయక విగ్రహాలకు ఫైనల్ టచ్



విగ్రహాల తరలింపు

సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 9 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.07 కోట్లు
సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 67,767
తలనీలాలు సమర్పించినవారు: 25,852

తిరుమలలో ప్రముఖులు







తిలక్ వర్మ - వెంకీ కుడుముల, మల్లాది వశిష్ట - గంగై అమరన్

తిరుమల, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఇండియన్ క్రికెటర్ తిలక్ వర్మ, సినీ దర్శకులు వెంకీ కుడుముల, మల్లాది వశిష్ట, సంగీత దర్శకుడు గంగై అమరన్ ఉన్నారు. అలాగే బీఏపీఎస్ సామి నారాయణ్ సంస్థకు చెందిన సాధు బ్రహ్మవిహారి స్వామిజీ 70 మంది శిష్య బృందంతో శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం శ్రీవారి పుష్కరిణికి చేరుకుని ధ్యానం చేశారు.



శ్రీవారి పుష్కరిణిలో శిష్య బృందంతో బ్రహ్మవిహారి స్వామిజీ

తిరుమలలో కూలిన చెట్టు

● సెక్యూరిటీ గార్డుకు గాయాలు



తిరుమల, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం ఉదయం ఓ భారీ వృక్షం కూలడంతో సెక్యూరిటీ గార్డు గాయపడ్డాడు. ఎంబీసీ 34 వద్ద గాలికి చెట్టుకూలడంతో బైక్‌పై వెళుతున్న టీటీడీ సెక్యూరిటీ గార్డు చంద్రశేఖర్ రెడ్డి గాయపడ్డాడు. ఆయనను అశ్విని ఆస్పత్రికి తరలించారు.

మొదటిఘాట్‌లో ఊడిన బస్సు చక్రం

● ప్రమాణికులు సురక్షితం



తిరుమల, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో మంగళవారం ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. 25 మంది ప్రయాణికులతో తిరుపతికి బయలుదేరిన బస్సు 55వ మలుపు వద్ద మెయిన్ రాడ్డు నుంచి చక్రం విడిపోయి కిందకు వంగిపోయింది. డ్రైవర్ అప్రమత్తమై బ్రేకులు వేయడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

డ్యూటీ అయ్యాక కిందకి దిగేయాల్సిందే!

● హోటళ్లు, దుకాణాల్లోని కార్మికులను ఆదేశించిన పోలీసులు



హాకర్లు, కార్మికులు, యాచకులను తిరుపతికి తరలిస్తున్న పోలీసులు

తిరుమల, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): తిరుమలలో దుకాణాలు, హోటళ్లు, టీ దుకాణాల్లో పనిచేసే కార్మికులు వారి విధులు పూర్తికాగానే తిరుపతికి వెళ్లిపోవాలని పోలీసులు ఆదేశించారు. ఈ బాధ్యతను యజమానులే తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో టీటీడీ విజిలెన్స్, తిరుమల పోలీసులు మంగళవారం పలు ప్రదేశాల్లో తనిఖీలు చేసిన తర్వాత ఈ సూచనలు చేశారు. సాధారణ భక్తుల కోసం తిరుమలలో ఏర్పాటు చేసిన వసతి సముదాయాలు, షెడ్లలో కార్మికులు ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. అనధికారికంగా 75 మంది హాకర్లు, కార్మికులు, యాచకులు ఇలా ఉంటున్నారని గుర్తించి ఈ ఆదేశాలు జారీ చేశారు. వారిని తిరుమల నుంచి తిరుపతికి తరలించారు.

1 నుంచి తిరుపతి-మదనపల్లి రోడ్డు వరకు ప్రత్యేక రైలు

తిరుపతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సెప్టెంబరు1 నుంచి 30వ తేది వరకు ప్యాసింజర్ రైలును నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు. తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు(07262) ఉదయం 4.10 గంటలకు బయలుదేరి 7.15 గంటలకు మదనపల్లిరోడ్డు రైల్వే స్టేషన్‌కు చేరుకొంటుంది. తిరిగి మదనపల్లిరోడ్డు స్టేషన్‌లో ఈ ప్రత్యేక రైలు(07261) మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి సాయంత్రం 6 గంటలకు తిరుపతికి చేరుకొంటుంది. ఈ ప్రత్యేక రైలు తిరుపతి నుంచి పాకాల, పీలేరు, కలికిరి స్టేషన్ల మీదుగా మదనపల్లిరోడ్డు స్టేషన్ వరకు రాకపోకలు సాగిస్తుంది.

● **తిరుపతి-మన్నార్‌గుడి పామని ఎక్స్‌ప్రెస్‌కు రెండు ఏసీ కోచ్‌లు**

తిరుపతి-మన్నార్‌గుడి మధ్య రాకపోకలు నిర్వహించే పామని ఎక్స్‌ప్రెస్‌కు సెప్టెంబరు 4, 5 తేదీల్లో రెండు ఏసీ ఛైర్ కార్ కోచ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

వృద్ధురాలి హత్య కేసులో నిందితుడి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం) ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆరు రోజుల క్రితం బంగారు నగల కోసం ఒక వృద్ధురాలిని దారుణంగా హత్య చేసిన ఘటనలో నిందితుడిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. అలిపిరి సీఐ రాంకిషోర్ కథనం మేరకు స్థానిక కొరమేనుగుంటలోని సీపీఆర్ అపార్టుమెంటులో కాపురమున్న ధనలక్ష్మి నిద్రపోతున్న సమయంలో ఇంటిలో పని చేస్తున్న విజయవాడకు చెందిన బందేల రవి కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. అనంతరం ఇంటిలో వున్న చీర కట్టుకుని గుర్తుపట్టని విధంగా పారిపోయాడు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేసిన సీఐ రాంకిషోర్, ఎస్‌ఐలు లోకేష్‌బాబు, నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటుచేశారు. ఘటనా స్థలం నుంచి సేకరించిన సీసీ ఫుటేజీల ఆధారంగా స్థానిక ఆటోనగర్ బస్టాపు వద్ద ఉన్నాడనే సమాచారంతో అక్కడకు చేరుకున్న పోలీసులు మధ్యవర్తుల ఆధ్వర్యంలో రవిని అరెస్టు చేశారు. నిందితుడు రవిపై నేర చరిత్ర వున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. వృద్ధురాలి మెడ నుంచి అపహరించుకెళ్లిన బంగారు కమ్మలను స్వాధీనం చేసుకున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ డిస్మిస్

కోట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కోట ఫీల్డ్ అసిస్టెంట్ పద్మమ్మను డిస్మిస్ చేస్తూ డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఆమెను పలు ఆరోపణలతో మండల అధికారులు విధుల నుంచి పాక్షికంగా తప్పించారు. మంగళవారం పూర్తిగా తొలగిస్తూ డ్వామా పీడీ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో వేణు తెలిపారు.

చీటింగ్ కేసులో జర్నలిస్టు అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని రమాదేవి ఆసుపత్రి పరిపాలనా అధికారి, సూరింటెండెంట్‌ను బెదిరించి డబ్బులు డిమాండ్ చేసిన ఘటనలో పరారీలో వున్న జర్నలిస్టు మాచర్ల శ్రీనివాసులను అరెస్టు చేసినట్లు తిరుపతి వెస్ట్ సీఐ మురళీమోహన్ మంగళవారం తెలిపారు. ఇతడిపై అలిపిరి పోలీసుస్టేషన్‌లో మరో కేసు నమోదై వున్న విషయం విధితమే. దీంతో అతడి కోసం దాదాపు నాలుగు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. తిరుపతి, విజయవాడ, నెల్లూరు, కడప తదితర ప్రాంతాల్లో గాలించారు. మంగళవారం తిరుపతిలోని స్నేహితుల ఇంటి వద్ద ఉన్నట్లు తెలిసి సీఐ మురళీమోహన్ అతడిని అదుపులోకితీసుకుని అరెస్టు చేశారు. న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ చెప్పారు.

ప్రమాదం సంభవిస్తే బాధ్యత ఎవరిది?


● మఠం భవనం కూల్చివేయండి
● ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): శిథిలావస్థలోనున్న పురాతన మఠం భవనం కూలిపోయి ప్రమాదం సంభవిస్తే బాధ్యత ఎవరు తీసుకుంటారని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి ప్రశ్నించారు. ఐఐటీ నిపుణులు సూచించిన మేరకు ఈ భవనాన్ని కూల్చివేయాలని డిమాండు చేశారు. తిరుపతి నగరం గాంధీరోడ్డులోని హథీరాంజీ మఠం భవనాలను మంగళవారం స్వామీజీలు, హిందూ సంఘాల నాయకులతో కలిసి పరిశీలించిన ఆయన మీడియాతో మాట్లాడారు. నాటి ప్రతిపాదనలకు అనుగుణంగా భవనం కూల్చడానికి టెండర్లు కూడా నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే స్వార్థ రాజకీయాలు ప్రవేశించి శిథిలావస్థకు చేరుకున్న ఈ భవనాన్ని కూల్చకూడదని కలెక్టర్‌పై ఒత్తిడి తెస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. దాని కోసం ఈ మఠం భవనాల విషయంలో సాగదీత కొనసాగిస్తున్నారని చెప్పారు. కూల్చకూడదనే అభిప్రాయం ఉంటే అధికారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ భవనంలో నెల రోజులు ఉండడం ద్వారా ప్రమాదం లేదని నిరూపించాలని సూచించారు. కలెక్టర్ స్పందించి రాజకీయాలకు అతీతంగా భవన శిథిల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రమాదం సంభవించక ముందే భవనాన్ని కూల్చివేయాలని కోరారు. భవనం గదుల్లో ఉండే దుకాణదారులు నష్టపోకుండా న్యాయం చేయాలన్నారు. ఏపీ సాధు పరిషత్ గౌరవ అధ్యక్షులు అట్లూరి నారాయణరావు, శివానంద స్వామి, తుమ్మ ఓంకార్, రమాదేవి,జెన్ కిరణ్,నీలకంఠ, చంద్రమౌళి,సురేష్ నాయక్, పుష్పలత, వెంకటేష్, సుధాకర్ చౌదరి,హిందూ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మట్టితో గణపతులు.. చిట్టిచేతుల అద్భుతం

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. వందల మంది చిన్నారులు తమ చేతులతో మట్టి గణపతి రూపాలను అద్భుతంగా తీర్చిదిద్ది ఆశ్చర్యపరిచారు. వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల తయారీపై పాఠశాల విద్యార్థులకు ఏజీఎస్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం పోటీలు నిర్వహించారు. నగరంలోని పలు పాఠశాలలకు చెందిన సుమారు 700 మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ పంపిణీ చేసిన మట్టి ముద్దలతో రకరకాల రూపాలతో గణపతి ప్రతిమలు దర్శనమిచ్చాయి. ఈ మట్టి ప్రతిమలను పరిశీలించి విద్యార్థులను నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అభినందించారు. విజేతలకు ప్రశంసాపత్రాలను, మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.వినాయక సాగర్‌లో నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, అధికారులు సూచించిన మార్గాల్లో తరలివచ్చి నిమజ్జనాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాసులు, టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, నవీన్ కుమార్‌రెడ్డి, చెన్నం నవీన్, ఎన్వీఎం వెంకటేష్, కరాటి శ్రీనివాస్, సుబ్రమణ్యంరెడ్డి, చెంగారెడ్డి, వాసు, గోపి, ప్రసాద్, డీపీ ఆనంద్, డాక్టర్ నరేష్, నాగేశ్వరరావు, రఘురామిరెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.





విజేతలకు మొక్కలు అందిస్తున్న కమిషనర్,ఉత్సవ కమిటీ సభ్యులు

ముగిసిన అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలు

● పది క్రీడాంశాల్లో విన్నర్స్, రన్నర్స్‌కు సర్టిఫికెట్ల ప్రదానం

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మూడు రోజులపాటు నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్ కప్ రాష్ట్రస్థాయి పోటీలు మంగళవారం ముగిశాయి. పది క్రీడాంశాల్లో జరిగిన పోటీల్లో విన్నర్స్ రన్నర్స్‌కు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈనెల 29న విశాఖలో జరిగే జాతీయ క్రీడా దినోత్సవంలో విజేతలకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పతకాలు ప్రదానం చేయనున్నారు. ముగింపు కార్యక్రమంలో తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. అతి తక్కువ సమయంలో ఛాలెంజ్‌గా తీసుకొని మూడు రోజులుగా రాష్ట్రస్థాయి పోటీలు దిగ్విజయంగా నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో విజేతలు ఒలింపిక్, కామన్‌వెల్త్, ఏసియన్ గేమ్స్‌లో రాణించి దేశం గర్వించేలా పతకాలు సాధించాలని కోరారు. నాలుగు జోన్ల నుంచి వచ్చిన క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని, ఎస్వీయూ, మహిళా వర్శిటీలలో బస ఏర్పాటు చేశామన్నారు. రవాణా, ఇతర ఏర్పాట్లు కల్పించడంతో ఎక్కడా లోటుపాట్లు, ఫిర్యాదులు అందలేదన్నారు. తిరుపతిలో మరింత పెద్దస్థాయిలో క్రీడలు నిర్వహించుకునే అవకాశం ఈ పోటీల ద్వారా నిరూపితమైందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనరు మౌర్య, శాప్ డైరెక్టర్లు రజని, సంతోష్, అధికారులు కోటేశ్వరరావు, శశిధర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



ఆర్చరీకి సంబంధించి ఫైనల్స్‌లో తలపడుతున్న క్రీడాకారులు



ఆర్చరీకి సంబంధించి ఫైనల్స్‌లో తలపడుతున్న క్రీడాకారులు

జిల్లాల వారీగా విన్నర్స్, రన్నర్స్ వివరాలిలా..

హాకీ: పురుష విభాగంలో తిరుపతి, కాకినాడ.. మహిళా విభాగంలో అనకాపల్లి, కాకినాడ జిల్లాలు విన్నర్స్ రన్నర్స్‌గా నిలిచాయి.

అథ్లెటిక్స్: పురుష విభాగంలో శ్రీకాకుళం, కాకినాడ, పల్నాడు, కడప విన్నర్స్‌గాను.. అల్లూరి సీతారామరాజు (ఏఎస్ఆర్), పల్నాడు, కడప రన్నర్స్‌గా నిలిచాయి. మహిళా విభాగంలో విజయనగరం, అనకాపల్లి, కడప విన్నర్స్‌గాను.. విజయనగరం, కాకినాడ, గుంటూరు, కడప రన్నర్స్‌గా నిలిచాయి.

షటిల్ బాడ్మింటన్: పురుష విభాగంలో సింగిల్స్, డబుల్స్ రెండింటిలోనూ కోనసీమ విన్నర్స్‌గా.. సింగిల్స్‌లో ఎన్టీఆర్, డబుల్స్‌లో పశ్చిమగోదావరి రన్నర్స్‌గా నిలిచాయి. మహిళా విభాగంలో సింగిల్స్, డబుల్స్ రెండింటిలోనూ విన్నర్స్‌గా ఎన్టీఆర్ జిల్లా నిలవగా.. రన్నర్స్‌గా సింగిల్స్‌లో కడప, డబుల్స్‌లో ఎన్టీఆర్ నిలిచాయి.

బాస్కెట్‌బాల్: పురుష విభాగంలో చిత్తూరు, కడప.. మహిళా విభాగంలో ఏలూరు, వైజాగ్ విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచాయి.

బాక్సింగ్: పురుష విభాగంలో విన్నర్స్‌గా వైజాగ్, శ్రీకాకుళం, ఎన్టీఆర్, గుంటూరు, తిరుపతి.. రన్నర్స్‌గా తిరుపతి, అనంతపురం, కర్నూలు, ఉభయ గోదావరి జిల్లాలు, కోనసీమ, కాకినాడ, ఎన్టీఆర్, శ్రీకాకుళం నిలిచాయి. మహిళా విభాగంలో విన్నర్స్‌గా వైజాగ్, అనకాపల్లి, రన్నర్స్‌గా ఉభయగోదావరి, తిరుపతి, అనంతపురం, ఎన్టీఆర్ జిల్లాలు ఉన్నాయి.

కబడ్డీ: పురుష విభాగంలో కాకినాడ గెలుపొందగా.. అనంతపురం రెండో స్థానంలో నిలిచింది. మహిళా విభాగంలో విన్నర్స్ ఎన్టీఆర్, రన్నర్స్ శ్రీకాకుళం జిల్లాలు

ఖో-ఖో: పురుష విభాగంలో విన్నర్స్ గుంటూరు, రన్నర్స్ వైజాగ్. మహిళా విభాగంలో విన్నర్స్ కాకినాడ, రన్నర్స్ వైజాగ్

వాలీబాల్ : పురుష విభాగంలో విన్నర్స్ మన్యం, రన్నర్స్ తిరుపతి. మహిళా విభాగంలో విన్నర్స్ ఎన్టీఆర్, రన్నర్స్ వైజాగ్

వెయిట్ లిఫ్టింగ్ : పురుష విభాగంలో విన్నర్స్ వైజాగ్, అనకాపల్లి, కడప, గుంటూరు, వైజాగ్, గుంటూరు, బాపట్ల, పశ్చిమగోదావరి, కడప, కర్నూల్. మహిళా విభాగంలో విన్నర్స్ కాకినాడ, రన్నర్స్ వైజాగ్.

ఆర్చరీ: పురుష విభాగంలో విన్నర్స్ తిరుపతి, గుంటూరు.. రన్నర్స్ గుంటూరు, కాకినాడ, తిరుపతి. మహిళా విభాగంలో విన్నర్స్ వైజాగ్, కాకినాడ, గుంటూరు.. రన్నర్స్ తిరుపతి, గుంటూరు.

పెద్ద వినాయక విగ్రహాల పంపిణీ

తిరుపతి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతి, శ్రీకాళహస్తి, వెంకటగిరి నియోజకవర్గాల్లోని పల్లెలకు మంగళం బొమ్మల క్వార్టర్స్ వద్ద 960 పెద్ద వినాయక విగ్రహాలు పంపిణీ మంగళవారంతో పూర్తయింది. ట్రస్ట్ నిర్వాహకుడు జాతీయ టూరిజం మాజీ బోర్డు డైరెక్టర్ సురేంద్రకుమార్ రెడ్డి మాట్లాడుతూ నిత్యం వినాయక స్వామి ఆరాధనలో వున్న తనకి స్వామి ఆశీస్సులు వెన్నంటే నిలిచాయన్నారు. 50 విగ్రహాలనుంచి వెయ్యి విగ్రహాలు ఇచ్చే శక్తిని స్వామి అనుగ్రహించారన్నారు. గతంలో శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట, వెంకటగిరి, నగరి, చంద్రగిరి, గంగాధర నెల్లూరు నియోజకవర్గాలలోని పలు గ్రామాలకు ఇచ్చేవాడినని చెప్పారు. పర్యావరణ హిత విగ్రహాలనే అందిస్తామన్నారు. జనసేన నేత కిరణ్ రాయల్ మాట్లాడుతూ దాదాపు పాతికేళ్లుగా ఏడాదికి పాతికలక్షలు పైగా ఖర్చుపెట్టి ఉచితంగా విగ్రహాలు పంపిణీ చేయడం సురేంద్రకుమార్ రెడ్డికే సాధ్యమన్నారు.



వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న సురేంద్రకుమార్ రెడ్డి, జనసేన నేత కిరణ్ రాయల్ తదితరులు

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి















విద్యుత్‌శాఖ ఇన్‌చార్జి ఏఈగా రాజేష్

బాలాయపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి విద్యుత్‌శాఖ ఇన్‌చార్జి ఏఈగా రాజేష్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు.

పోలేరమ్మ జాతరను విజయవంతం చేయండి: కురుగొండ్ల

వెంకటగిరి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతో అధికారులు, ఆలయ పాలకవర్గం సమష్టిగా పనిచేసి గ్రామశక్తి పోలేరమ్మ జాతరను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. జాతర నిర్వహణ, ఏర్పాట్లపై మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ముఖ్యమైన వారికి మాత్రమే వీఐపీ దర్శన ఏర్పాట్లు కల్పించడం జరుగుతుందని, సామాన్య భక్తులందరికీ సజావుగా అమ్మవారి దర్శనం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా మాట్లాడుతూ జాతర నిర్వహణలో వివిధ శాఖల అధికారులు చేపట్టనున్న ఏర్పాట్ల గురించి సమీక్షించి సూచనలు ఇచ్చారు. పోలేరమ్మ ఆర్చి వద్ద ఏర్పాటు చేసే కంట్రోల్ రూంలో ప్రతి శాఖకు సంబంధించి ఒకరు అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, డీఎస్పీ గీతాకుమారి, దేవదాయశాఖ ఈవో శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

వెంకటగిరి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాశీపేట కూడలిలో కవచ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక ప్రతిమలను ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథనాయుడు చేతుల మీదుగా ప్రజలకు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణ చర్యల్లో భాగంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేపట్టిన ట్రస్టు చైర్మన్ మనోజ్‌ను అభినందించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆ శాఖ ఎస్ఈ సురేంద్ర నాయుడు అన్నారు. మంగళవారం నాయుడుపేట విద్యుత్‌శాఖ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినాయక మండపాల వద్ద విద్యుత్ వైర్లను జాగ్రత్తగా ఏర్పాటు చేయాలని సూచించారు. విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం సమయంలో లైన్ ఇన్‌స్పెక్టర్, జూనియర్ లైన్‌మెన్‌లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వినియోగదారులు తమ సమస్యలను 1912కు లేదా స్థానిక లైన్‌మెన్‌కు తెలియజేయాలన్నారు. సమావేశంలో డీఈ శ్రీనివాసులు, ఏడీలు వరప్రసాద్‌రెడ్డి, శేఖర్, శ్రీనివాసులు, ఏఈలు శివశంకర్, హరికృష్ణ, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతిసేవా సంస్థ కార్యాలయంలో మంగళవారం పొనకా మల్లికార్జున్‌రెడ్డి దాతృత్వంతో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు.

ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు

బాలాయపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని ఊట్లపల్లిలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. మస్టర్ల నమోదులో అవతవకలు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనిచేస్తే కూలి గిట్టుబాటు అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీవో జ్యోతి, ఈసీ సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి

వెంకటగిరి టౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక 9వ బెటాలియన్, వల్లివేడు ప్రాంతాల్లో ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సగటు కూలి రూ.307 వచ్చేలా పనులు చేయించాలన్నారు. హార్టికల్చర్, వ్యక్తిగత పనులకు రైతులను ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డ్వామా అధికారి చంద్రశేఖర్ రాజు, ఏపీవో కృష్ణయ్య, మునిశేఖర్, వెంకయ్య, మల్లికార్జున్, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్
ఒకరి మృతి, మహిళకు గాయాలు

తడ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. సూళ్లూరుపేట మండలం కొమ్మినేనిపల్లి గ్రామానికి చెందిన ఏలూరు యుగంధర్(38), భార్య రాజ్యలక్ష్మితో కలిసి వరదయపాళెం మండలం చెదులుపాకం గ్రామంలోని అత్తగారింటికి మంగళవారం సాయంత్రం బైక్‌పై బయలుదేరారు. తడ పోలీసు స్టేషన్‌కు సమీపంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో యుగంధర్ తలకు బలమైన గాయాలు కాగా, రాజ్యలక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా యుగంధర్ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒడిశావాసి మృతి

నాయుడుపేట టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పారిశ్రామికవాడ సమీపంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన అపార్థి ప్రధాన్(56) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. అపార్థి ప్రధాన్ జూన్ 1నుంచి మేనకూరు పారిశ్రామికవాడలోని ఓ ప్రైవేట్ కర్మాగారంలో పని చేస్తున్నాడు. సోమవారం పని లేకపోవడంతోనే తాను నివాసం ఉంటున్న గదిలో నిద్రించాడు. సాయంత్రం 5 గంటలకు కూడా నిద్ర లేవకపోవడంతో సహచర కార్మికులు పలకరించినా స్పందించలేదు. వెంటనే సమీపంలో ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు. పరిశ్రమ యాజమాన్యం సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి అపార్థి ప్రధాన్ మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మంగళవారం పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

గూడూరు అర్బన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్ ప్రాంతంలోని రైలు పట్టాలపై ఓ యువకుడు మృతి చెంది ఉండటాన్ని గుర్తించిన స్థానికులు జీఆర్ పోలీసులకు సమాచారం అందించారు. జీఆర్ పోలీసుల వివరాల మేరకు.. స్థానిక మసీదు వీధి ప్రాంతానికి చెందిన సమీర్(24) ఓ ప్రైవేటు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. మంగళవారం స్థానిక గాంధీనగర్ ప్రాంతంలో తిరుపతి వైపు వెళ్లే మార్గంలోని రైలు పట్టాలపై మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతికి గల కారణాలు విచారణలో తెలియాల్సి ఉంది.

తూపిలిపాళెంలో నిమజ్జన ఏర్పాట్లు

వాకాడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తూపిలిపాళెం సముద్ర తీరంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు నిమజ్జన ఏర్పాట్లు చేశారు. డిప్యూటీ తహసీల్దారు రఫీ సయ్యద్ మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి 31 వరకు తూపిలిపాళెం, ఓడపాళెం సముద్ర తీరాల్లో నిమజ్జన ఏర్పాట్లు చేశామని, ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య గణేశ్ నిమజ్జనం చేయాలని సూచించారు. మద్యం తాగి నిమజ్జనానికి వచ్చే భక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ సముద్రతీరానికి రానీవ్వబోమని ఎస్ఐ నాగబాబు స్పష్టం చేశారు.

సీఎంను కలిసిన బెస్త కార్పొరేషన్ చైర్మన్

తడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బెస్త కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన బొమ్మన శ్రీధర్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిశారు. మంగళవారం అమరావతిలో ముఖ్యమంత్రి కార్యాలయంలో చంద్రబాబును కలిసిన బొమ్మన శ్రీధర్ తనను బెస్త కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రీకృష్ణుడి ప్రతిమను సీఎంకు అందజేశారు. శ్రీధర్‌తో పాటు టీడీపీ నాయకులు బొమ్మన పళణి, ఏకాంబరం ఉన్నారు.

కొత్తపట్నంలో గ్రామసభ

కోట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపట్నంలో మంగళవారం రెవెన్యూ గ్రామసభ జరిగింది. కొత్తపట్నంతో పాటు శ్రీనివాసపురం, వావిళ్లదొరువు, గోవిందపల్లి, గొవిందపల్లి పాళెం, యమదిన్నెపాళెం, గున్నంపడియా గ్రామాలకు చెందిన రైతులు భూసమస్యలపై తహసీల్దారుకు వినతిపత్రాలు అందజేశారు. కొన్ని సమస్యలను అధికారులు అక్కడే పరిష్కరించారు. సమావేశంలో మండల సర్వేయర్ గోపీరెడ్డి, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో శ్రీనివాసులు, టీడీపీ నాయకుడు వాటంబేటి చెంగల్‌రావు తదితరులు పాల్గొన్నారు.











